RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 105
Vol : 18
Issue : 105

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, గురువారం 18 జూన్ 2026
Karimnagar, Thursday 18 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED


పీపుల్స్‌డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859



## తరగతి గదిలోనే రాష్ట్ర భవిష్యత్తు

- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతాం
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- రూ.15 కోట్ల వ్యయంతో టీపీఎస్‌ను ప్రారంభించిన సీఎం

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** "తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు రంగుల గోడల్లోనో లేదా అద్దాల మేడల్లోనో లేదు.. అది కేవలం మన ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లోనే దాగి ఉందని మేం సంపూర్ణంగా విశ్వసిస్తున్నాం" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్) ను ఆయన బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ల్యాబ్‌లు, లైబ్రరీ, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను సీఎం స్వయంగా పరిశీలించారు. వంట గదిలో పూరీలు చేసిన సీఎం అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు.

(మిగతా 2లో...)

## నాయకుడు కాదు... మనసున్న మనిషి

- అభిమాని కన్నీటి వెనుక చిరునవ్వు పూయించిన పవన్ కల్యాణ్
- మంచానికే పరిమితమైన చిన్నారి నిరంజన్‌కు ఆత్మీయ పరామర్శ
- నుదుటిపై పెట్టిన ముద్దుతో వెలిగిన ఆశల దీపం
- క్యాంటీన్ రూపంలో ఆ కుటుంబానికి జీవనోపాధి దారి...
- హన్మకొండలో పర్యటించిన ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**పీపుల్స్‌డైరీ–హనుమకొండ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణలోని హన్మకొండకు పట్టణానికి చెందిన తన వీరాభిమాని పొనుగోటి నిరంజన్‌ను పరామర్శించారు. ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్నారు. ఆ చిన్నారి కోరికను నెరవేర్చారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయన హన్మకొండకు చేరుకున్నారు. నేరుగా హనుమాన్ నగర్‌లో ఉన్న నిరంజన్ నివాసానికి వెళ్లారు.

నిరంజన్ డీఎండీ అనే అరుదైన కండరాల క్షీణత వ్యాధితో మంచానికే పరిమితం అయ్యాడు. పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని. తనను కలవాలని (మిగతా 2లో...)



## సన్నబియ్యం కృత్రిమ కొరత?

- తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన బియ్యం ధరలు
- రికార్డు స్థాయి దిగుబడి ఉన్నా ఇంత ధరా?
- మిల్లర్లు, ట్రేడర్ల సిండికేట్‌తో సామాన్యుడిపై భారం!
- బ్లాక్ మార్కెట్లకు తరలుతున్న నిల్వలు

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.

ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధరకాల సన్న

(మిగతా 2లో...)

## గ్యాస్ వినియోగదారులకు అలర్ట్

- ఈ కేవైసీ చేయకుంటే సబ్సిడీ కట్?
- జూన్ 30 వరకు తుది గడువు

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలంగాణలోని ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు పౌరసరఫరాల శాఖ అలర్ట్ జారీ చేసింది. గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ బయోమెట్రిక్ అథెంటికేషన్ ప్రక్రియను ఈ నెలాఖరు (జూన్ 30) లోపు ఖచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. లేదంటే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలో కోత విధించ నున్నారు. గత ఏడాది కాలంగా ఈ–కేవైసీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతున్నప్పటికీ.. ఇంకా చాలా మంది వినియోగదారులు దీనిని పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం ఈసారి తుది గడువును విధిస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. అక్రమ గ్యాస్ కనెక్షన్లకు శాశ్వతంగా అడ్డు కట్ట వేయడంతో పాటు, అర్హులైన వారికే ప్రభుత్వ రాయితీలు చేరేలా చూడటం, నిధుల దుర్వినియోగాన్ని నిరోధించటమే లక్ష్యంగా ఈ డిజిటల్ ధృవీకరణను ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా గ్యాస్ కనెక్షన్లను వినియోగదారుల అధికారిక గుర్తింపు పత్రాలతో అను సంధానం చేస్తారు. దీనికోసం ప్రధా నంగా మూడు రకాల ఆధునిక (మిగతా 2లో...)



## రైలులో దూడ దర్జా...

- వైరల్ అయిన వీడియో..
- భారతీయులా మజాకా...
- నెటిజన్ల ఫన్నీ కామెంట్లు



2లో





## నకిలీ సర్టిఫికెట్లతో డీలర్లుగా చెలామణి!

2వ పేజీలో..

- నిర్దేశిత విద్యార్హత లేకున్నా డీలర్లుగా పెత్తనం
- డీలర్లుగా రూపాంతరం చెందిన కిరోసిన్ హ్యాకర్లు
- నకిలీ స్టడీ సర్టిఫికెట్‌లతో మరి కొందరు రేషన్ డీలర్లు
- విద్యార్హత లేని వారికి నకిలీ సర్టిఫికెట్ కేటాయించిన విద్యాశాఖ?
- కిరోసిన్ హకర్లకు గతంలో రెవెన్యూ అధికారుల షోకాజ్ నోటీసులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు
- కలెక్టర్ దృష్టికి నకిలీ ధ్రువపత్రాల రేషన్ డీలర్లు?





## డిజిటల్ ఆశాకిరణం

- నిత్యం సాంకేతిక నిఘాలో సోషల్ మీడియా
- తప్పుచేస్తే తప్పించుకోలేరు...
- ఆపదలో ఉన్నవారికి సైతం అండగా...
- అసభ్యకర మెస్సేజ్‌లు, మార్ఫింగ్‌లు, విద్వేశపూరిత ప్రచారాలు చేస్తున్నారా?
- ఉక్కుపాదం మోపేందుకు సైబర్ పోలీసులు సన్నద్ధం...!
- కాలం చెరపలేని డిజిటల్ ముద్ర.... ఏది చేసినా చెల్లుతుంది అనుకోవద్దు

**పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ :** సోషల్ మీడియాలో ఏం పోస్ట్ చేసినా ఎవరికీ తెలుస్తుందిలే, ఏం కాదులే అని అనుకునే రోజులు ఇక ముగిశాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రతి కదలికపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిఘా కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఆత్మహత్యకు సంబంధించిన సంకేతాలు ఇచ్చే పోస్టులు, స్టేటస్‌లు, సందేశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మెటా సంస్థతో సమన్వయం చేసుకుంటూ ప్రాణాలను కాపాడే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

"ఇక బతకాలనిపించడం లేదు", "ఇది నా చివరి పోస్ట్", "చనిపోతున్నా.. గుడ్‌బై" వంటి సందేశాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వారిని మెటా ప్రత్యేక అల్గోరిథంల ద్వారా గుర్తిస్తోంది. అలాంటి అనుమానాస్పద పోస్టులు కనిపించగానే వెంటనే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ అధికారులకు సమాచారం చేరుతోంది. అనంతరం రంగంలోకి దిగుతున్న పోలీసులు సంబంధిత వ్యక్తుల లొకేషన్‌ను గుర్తించి, అత్యవసరంగా అక్కడికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఏడు నెలల కాలంలో ఇలాంటి ఆత్మహత్య సంకేతాలు ఉన్న పోస్టులు చేసిన సుమారు 800 మందిని అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీరిలో 260 మంది తెలంగాణకు చెందినవారే కావడం విశేషం. ప్రేమ విఫలం కావడం, పరీక్షల్లో ఫెయిల్ అవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు వంటి కారణాలతో తీవ్ర (మిగతా 2లో...)

పీపుల్స్‌డైరీ

కరీంనగర్

గురువారం, 18 జూన్ 2026

సంపుటి : 18, సంచిక : 105



# తరగతి గదుల్లోనే... రాష్ట్ర భవిష్యత్తు



(మొదటి పేజీ తరువాయి)

స్కూల్ గ్రౌండ్‌లో వారితో సరదాగా ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు.

ఆ తర్వాత జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్వేగభరితంగా మాట్లాడారు. ఆరుట్లలో ప్రారంభమైన ఈ మోడల్ పాఠశాలను రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ విద్యార్థులకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. "ధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకే ఈ పాఠశాలలను తెచ్చాం. ఇప్పటికే ఆరుట్ల స్కూల్‌లో 1,814 మంది విద్యార్థులు చేరారు. కార్పొరేట్ సంస్థలకు పోటీగా ఒక ప్రభుత్వ పాఠశాలకు 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే పరిస్థితి రావడం నిజంగా గర్వకారణం. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నా" అని సీఎం కొనియాడారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ బడిలోనే చదివి సీఎంనయ్యా..

సమాజంలో అసమానతలు పోవాలన్నా, తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతకాలన్నా నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని సీఎం ఉద్ఘాటించారు. "ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే అపోహ వీడాలి. ఇక్కడ చదివిన ఎందరో గొప్ప అధికారులు, నాయకులుగా ఎదిగారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారితో పాటు నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను. ఇక్కడ చదివే మన విద్యార్థులు కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, కాబోయే రాజకీయ నాయకులుగా ఎదగాలి" అని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం కులాల వారీగా స్కూళ్లు పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహిస్తే, తాము ఆ వివక్షను తుడిచేయడానికే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని, అలాగే డిసెంబర్ 9న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భవనాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు.

## రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామా?..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖపైనే ఏకంగా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, గతంలో ఇచ్చిన నాసిరకం యూనిఫామ్‌ల స్థానంలో తాము రూ.680 కోట్లతో నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి టెండర్లు పిలిచామని సీఎం చెప్పారు. అయితే, దీనిపై రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని కొందరు ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల అవినీతి ఎలా సాధ్యమో ఆ మేధావులే చెప్పాలి" అని ఎద్దేవా చేశారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు ఒలింపిక్స్ లక్ష్యంగా 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామని, గతంలో తాము ఫుట్‌బాల్ దిగ్గజం 'మెస్సీ'ని హైదరాబాద్‌కు రప్పిస్తే దానిపైనా రాజకీయ విమర్శలు చేశారని మండిపడ్డారు. "కడుపులో కుళ్లు పెట్టుకుని ప్రతిదానిపై అబద్ధాలు ప్రచారం చేసే వాళ్లకు భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కూడా మిగలదు. విమర్శలు చేసేవాళు ఉంటే వారికి వచ్చి ఆరుట్ల స్కూల్ చూపించండి. ప్రజలు మాకు అండగా నిలబడితే తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు.

# నకిలీ సర్టిఫికెట్లతో డీలర్లుగా చెలామణి

- నిర్దేశిత విద్యార్హత లేకున్నా డీలర్లుగా పెత్తనం
- డీలర్లుగా రూపాంతరం చెందిన కిరోసిన్ హ్యాకర్లు
- నకిలీ స్టడీ సర్టిఫికెట్‌లతో మరి కొందరు రేషన్ డీలర్లు
- విద్యార్హత లేని వారికి నకిలీ సర్టిఫికెట్ కేటాయించిన విద్యాశాఖ?
- కిరోసిన్ హకర్లకు గతంలో రెవెన్యూ అధికారుల షోకాజ్ నోటీసులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు
- కలెక్టర్ దృష్టికి నకిలీ ధ్రువపత్రాల రేషన్ డీలర్లు?

**పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్ :** రేషన్ డీలర్ల కొత్త దందా బయటకు వచ్చింది. ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యాన్ని తప్పు దోవ పట్టించడమే కాకుండా కనీస విద్యార్హత లేకుండా చక్కబెడుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ డీలర్‌గా కొనసాగాలంటే కనీస విద్యార్హత ఉండాలి. గతంలో కిరోసిన్ హ్యాకర్లుగా కొనసాగిన కొందరు నకిలీ స్టడీ సర్టిఫికెట్‌లతో రేషన్ డీలర్లుగా కొనసాగుతున్నారని విశ్వసనీయ సమాచారం. వరంగల్ మండలంలో కాశిబుగ్గ, ఎల్బీనగర్, రామన్నపేట, చర్బౌలి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న డీలర్లు నకిలీ సర్టిఫికెట్‌లతో రేషన్ దుకాణాలు నడుపుతున్నట్టు తెలిసింది. కనీస విద్యార్హత లేకుండా రేషన్ దుకాణాలు నడపడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులందినప్పటికీ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఫిర్యాదు దారులు ధ్వజమెత్తుతున్నారు. నకిలీ సర్టిఫికెట్‌లతో పొందిన రేషన్ షాపు యజమానులు ప్రభుత్వం పేద ప్రజలకోసం కేటాయించిన నిత్యావసర సరుకులను తప్పు దారి పట్టించరని నమ్మకమేంటని వాపోతున్నారు. ఎటువంటి విద్యార్హత లేని వారికి విద్యాశాఖ అధికారులు తప్పుడు ధ్రువపత్రాలు ఎలా కేటాయిస్తారని ధ్వజమెత్తుతున్నారు. గతంలో కిరోసిన్ హ్యాకర్లకు రెవెన్యూ అధికారులు షోకాజ్ నోటీసులు అందించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవటం సంబంధిత అధికారులు సైతం చోద్యం చూస్తూ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత కొన్ని నెలల క్రితమే అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ విషయాన్ని బయటకు పొక్కకుండా లోలోపల దళారులకు నకిలీ పత్రాలతో రేషన్ డీలర్ నడుపుతున్న వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. వీరిపై చర్యలు తీసుకోకపోవటంలో ఆంతర్యమేమిటనే చర్చ బాహాటంగానే కొనసాగుతుంది. ఎలాంటి గుర్తింపు ధృవీకరణ పత్రాలు లేకుండా రేషన్ దుకాణాలు నడుపుతున్న వారిపై మండల స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

# సన్న బియ్యం కృత్రిమ కొరత?

(మొదటి పేజీ తరువాయి)

బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.

సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# డిజిటల్ ఆశాకిరణం..

(మొదటి పేజీ తరువాయి)

మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించే ముందు సోషల్ మీడియాలో చివరి సందేశాలు పెట్టిన పలువురిని పోలీసులు సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ అందించి ప్రాణాలను కాపాడినట్లు తెలుస్తోంది.

## అమ్మాయిల జోలికి వెళ్లారో.. అంతే

మరోవైపు సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపైనా సైబర్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఫేక్ అకౌంట్లు సృష్టించి మహిళలను వేధించడం, మార్ఫింగ్ ఫొటోలు వైరల్ చేయడం, అసభ్యకర కామెంట్లు చేయడం, బెదిరింపు సందేశాలు పంపడం వంటి ఘటనలను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారు. డిజిటల్ ఆనవాళ్లు, ఐపీ అడ్రస్‌లు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. సోషల్ మీడియాలో చేసే ప్రతి పోస్ట్, ప్రతి కామెంట్, ప్రతి షేర్ శాశ్వత డిజిటల్ రికార్డుగా మిగిలిపోతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. "సోషల్ మీడియాలో ఏది చేసినా చెల్లిపోతుంది" అనే భావనతో వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చని స్పష్టం చేస్తున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అసభ్యకర ప్రవర్తన, వేధింపులు, ద్వేషపూరిత ప్రచారాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో జాగ్రత్తగా వ్యవహరించాలని, బాధ్యతాయుతంగా పోస్టులు చేయాలని ప్రజలకు సూచిస్తున్నారు.

## కామెంట్ల విషయంలో కేర్‌ఫుల్..

సోషల్ మీడియా వేదికగా చేసే ప్రతి చర్య ఇప్పుడు సైబర్ నిఘా పరిధిలోకి వస్తోంది. కేవలం పోస్టులు మాత్రమే కాదు.. కామెంట్లు, రీ-షేర్లు, డైరెక్ట్ మెసేజ్‌లు, స్టోరీలు, రీల్స్ రూపంలో వచ్చే అభ్యంతరకర కంటెంట్‌పైనా అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, ప్రజా ప్రతినిధులు లేదా సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకుని అవమానకర పోస్టులు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఫేక్ అకౌంట్ల వెనుక దాక్కున్న వారిని సైతం గుర్తించడం పోలీసులకు సులభమవుతోందని అధికారులు చెబుతున్నారు. అలాగే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తప్పుడు ప్రచారాలు, ఫేక్ న్యూస్, మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే సందేశాలపై కూడా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సామాజిక బాధ్యతను విస్మరించి డిజిటల్ వేదికలను దుర్వినియోగం చేస్తే చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# నాయకుడు కాదు.. మనసున్న మనిషి..

(మొదటి పేజీ తరువాయి)

ఆశపడుతున్న విషయం జనసేన తెలంగాణ ప్రతినిధుల ద్వారా పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో బీజీగా ఉన్నప్పటికీ.. తన అభిమాని కోసం స్వయంగా అతని ఇంటికి వచ్చారు. లేవలేని స్థితిలో ఉన్న ఆ చిన్నారిని చూసి పవన్ చలించిపోయారు. మంచంపై నిరంజన్ పక్కనే కూర్చొని ఆత్మీయంగా హత్తుకున్నారు. ఆప్యాయంగా నుదుటిపై ముద్దుపెట్టారు. ధైర్యం చెప్పారు. నిరంజన్ గతంలో ఆరోగ్యంగా ఉన్న సమయంలో సినిమాల్లోని డాన్స్ స్టెప్స్‌ను అనుకరిస్తూ చేసిన స్టెప్పులు, ఫొటోలను పవన్ ఆసక్తిగా తిలకించారు. ఇంట్లో వాళ్లు, స్నేహితులు అంతా ఛోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని ఆ బాలుడు ఆనందంతో చెప్పగా ఎంతో సంతోషించారు.



నిరంజన్ పడుతున్న బాధను చూసి కదిలిపోయిన పవన్, ఆ బాలుడి తండ్రి రాంగోపాల్, తల్లి మానసతో మాట్లాడారు. చికిత్స గురించి ఆరా తీశారు. భగవంతుని ఆశీస్సులు ఉంటాయంటూ తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి శేషవస్త్రాన్ని ఆ బాలుడికి కప్పి, తీర్థప్రసాదాలను అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం పవన్ కల్యాణ్ తక్షణ సాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య సాయంతోనే సరిపెట్టకుండా ఆ కుటుంబ శాశ్వత జీవనోపాధి కోసం ఒక దీర్ఘకాలిక భరోసాను కల్పించారు.

నిరంజన్ తల్లిదండ్రులు గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసిన అనుభవం ఉండటంతో వారికి ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయించి జీవితంలో స్థిరపడేలా చూడాలని జనసేన పార్టీ తెలంగాణ నాయకులను సూచించారాయన. తనకు ఒక కుక్కపిల్ల కావాలని నిరంజన్ కోరగా, తప్పకుండా పంపిస్తానని పవన్ హామీ ఇచ్చారు. అద్దె ఇంట్లో ఉండడం వల్ల యజమానులు కుక్కను పెంచడానికి అంగీకరించట్లేదని నిరంజన్ తండ్రి చెప్పడంతో, పవన్ చొరవ తీసుకుని ఆ ఇంటి యజమానిని పిలిపించి మాట్లాడి ఒప్పించారు.

అనంతరం అక్కడి నుంచి నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి వెండి ప్రతిమను పూజించి ఆ కుటుంబానికి అందజేస్తానని చెప్పారు. అధికారిక హోదాలో ఉంటూనే ఒక సామాన్య అభిమాని కోరిక కోసం స్వయంగా తెలంగాణకు వచ్చి పవన్ చూపిన ఈ గొప్ప మనసు ఇరు రాష్ట్రాల ప్రజలలో ఆదరణ పొందుతోంది.

# గ్యాస్ వినియోగదారులకు అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక విధానాలను అందుబాటులోకి తెచ్చారు. వినియోగదారులు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ విధానాల ద్వారా తమ ఈ-కేవైసీని విజయవంతంగా పూర్తి చేసుకోవచ్చు. వినియోగదారుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-కేవైసీని పూర్తి చేయడానికి పౌరసరఫరాల శాఖ నాలుగు సులువైన మార్గాలను వెల్లడించింది.

వినియోగదారులు ఎక్కడికీ వెళ్లకుండానే నేరుగా సంబంధిత ఆయిల్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఇంట్లోనే ఫేస్ రికగ్నిషన్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు.

గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ చేసే సమయంలోనే డెలివరీ బాయ్స్ వద్ద ఉండే బయోమెట్రిక్ పరికరాల ద్వారా ఈ ప్రక్రియను కొన్ని ఏజెన్సీలు స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నాయి

వినియోగదారులు నేరుగా తమ పరిధిలోని గ్యాస్ డీలర్ల కార్యాలయాలకు వెళ్లి అక్కడ అందుబాటులో ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా ఉచితంగా కేవైసీ చేసుకోవచ్చు.

బయోమెట్రిక్ పూర్తి చేయని వినియోగదారులను ఫోన్ కాల్స్ లేదా ఎస్ఎమ్ఎస్ ద్వారా సంప్రదించి, వారు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందిన లబ్ధిదారులు ఏడాదికి ఒకసారి విధిగా ఈ బయోమెట్రిక్ ఈ-కేవైసీని పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

## సిలిండర్ల బుకింగ్‌లు ఆపితే చర్యలు..

ఇదే సమయంలో వినియోగదారులకు ఊరటనిచ్చే మరో కీలక ఆదేశాన్ని కూడా పౌరసరఫరాల శాఖ జారీ చేసింది. ఈ-కేవైసీ ఇంకా పూర్తి కాలేదనే నెపంతో కొన్ని గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల కొత్త సిలిండర్ బుకింగ్‌లను నిరాకరిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఈ చర్యను తీవ్రంగా తప్పుపట్టిన అధికారులు.. ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నప్పటికీ సిలిండర్ల సరఫరాను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపకూడదని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బుకింగ్‌లను నిరాకరించడం నిబంధనలకు విరుద్ధమని, అలాంటి ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వినియోగదారులు గడువు లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శ్రమనే నమ్ముకున్న మహోన్నత వ్యక్తి మండల రాములు

## అదనపు కలెక్టర్ వై.వి. గణేష్



**వరంగల్ జూన్ 17 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ జిల్లా రంగశాయిపేట కురుమవాడలో బుధవారం రోజున దివంగత మండల రాములు మూడవ రోజు సంతాప సభను కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల రాములు గొప్ప కష్టజీవి, అంకితభావం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. జీవితాంతం ఎవరి మీదా ఆధారపడకుండా తన కష్టాన్ని మాత్రమే నమ్ముకొని జీవించారని తెలిపారు. ఆయన అజం జాహీ మిల్స్‌లో కార్మికుడిగా 1991 వరకు సేవలందించి కుటుంబాన్ని ఆదర్శవంతంగా పోషించారని పేర్కొన్నారు. నేటి సమాజానికి మండల రాములు జీవితం స్ఫూర్తిదాయకమని, యువత ఆయన క్రమశిక్షణ, నిజాయితీ, శ్రమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సంతాప సభలో మండల పరశురాములు, నరసింహ రాములు, కొల్లూరి యోగానంద్, డాక్టర్ సాంబమూర్తి, మండల సీతారాములు, హరీష్, గుండు బాబురావు, కేడల ప్రసాద్, పరికిపండ్ల వేణు, కారేటి శంకర్ రావు యాదవ్, వాకులాభరణం శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, కుమ్మరి కృష్ణమూర్తి, బతిని రవికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొని దివంగత మండల రాములు గారికి ఘన నివాళులర్పించారు.

సభలో పాల్గొన్నవారు మండల రాములు సేవలను, సాదాసీదా జీవన విధానాన్ని, సమాజం పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరుపల్లి రవి కొంతం తారా మోహన్ కెడల పద్మ జనార్ధన్ మిత్రపరపతి సంఘం సభ్యులు జనతా పరపతి సంఘ సభ్యులు జై హనుమాన్ సంఘ సభ్యులు వినాయక పరపతి సంఘ సభ్యులు బంధుమిత్రులు తదితరులు హాజరై నివాళులర్పించారు.

# రైలులో దూడ దర్జా...

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : భారతీయ రైలు ప్రయాణాలలో తరచూ రకరకాల వింతలు, విశేషాలు వెలుగులోకి వస్తూనే ఉంటాయి. కొత్త రైళ్లు, ఆధునిక వసతులు అందుబాటులోకి వచ్చినా, పల్లెటూరి వాతావరణాన్ని తలపించే కొన్ని సంఘటనలు ఇప్పటికీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతుంటాయి. అలాంటి ఒక వినూత్నమైన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. రైలులో సాధారణ ప్రయాణీకులతో పాటు ఒక దూడ కూడా ప్రయాణించిన దృశ్యం నెటిజన్లను ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. భారతీయ రైల్వేలో ప్రయాణీకులు తమ పెంపుడు జంతువులను తీసుకువెళ్లడం కొత్తేమీ కాదు. కానీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక తాజా వీడియో నెటిజన్లను ఎంతగానో ఆశ్చర్యపరుస్తోంది. ఒక రైలు కోచ్‌లోని సాధారణ ప్రయాణీకుల మధ్య ఒక దూడ దర్జాగా ప్రయాణిస్తూ కనిపించింది. ఈ వింత దృశ్యాన్ని ఒకరు తన మొబైల్‌లో రికార్డ్ చేయగా, ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ అయిన ఈ వీడియో 5.2 మిలియన్లకు పైగా వీక్షణలతో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇందులో ఒక రైలు జనరల్ లేదా స్లీపర్ కోచ్ తరహా బోగీ కనిపిస్తోంది. సీట్లన్నీ ప్రయాణీకులతో నిండి ఉండగా, వారి మధ్యలో ఒక చిన్న దూడ నిలబడి ప్రయాణిస్తోంది. చుట్టుపక్కల ఉన్న ప్రయాణీకులు కూడా ఆ దూడను చూస్తూ నవ్వుకుంటూ, ఎంజాయ్ చేస్తూ కనిపించారు. తోటి ప్రయాణీకులలో ఒకరు ఈ పూర్తి ఉదంతాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా క్షణాల్లో వైరల్‌గా మారింది.

## నెటిజన్ల ఫన్నీ కామెంట్లు:

వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తూ ఫన్నీ కామెంట్లు పెడుతున్నారు. ఒక యూజర్ వ్యంగ్యంగా, దీనికి కూడా ప్రయాణించడానికి రైలు టికెట్ ఉందా? అని ప్రశ్నించారు. మరొక మహిళా యూజర్, ఒకవేళ నేను గనుక ఆ రైలులో ఉంటే, నేను ఎక్కడ కూర్చోవాలి? అంటూ నవ్వుతున్న ఎమోజీలను షేర్ చేశారు. కొందరు యూజర్లు ఇండియా ఎప్పటికీ మారదు అని కామెంట్ చేయగా, మరికొందరు బీహార్ ఈజ్ నాట్ ఫర్ బిగినర్స్ అంటూ చమత్కరించారు.

# శివగంగేశ్వర మంటపానికి విశ్రాంత ఉద్యోగి రూ.50,100 విరాళం

వరంగల్ జూన్ 17 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ నగరంలో గల రంగశాయిపేట శివారు జక్కలొద్దీ వద్ద నిర్మిస్తున్న శివగంగేశ్వర మండప నిర్మాణానికి, రంగశాయిపేట స్థానిక పెద్దలు, రిటైర్డ్ టీచర్, దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ కార్యదర్శి, మునుకుంట్ల రాములు తన వంతు సహాయంగా రూ.50,100 విరాళంగా ఇచ్చి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిమర్స్ సభ్యులు అందరూ సంతోషంగా మునుకుంట్ల. రాములును పూలదండ, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది, శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ దేవాలయాల్లో హిందూ బంధువులు అందరూ ఎవరి శక్తి కొలది వారు సహాయ సహకారాలు అందించుకున్న హిందూ ధర్మం అభివృద్ధి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ అంకతి రాజేందర్, ఉపాధ్యక్షులు తాడెం కుమార్, పస్తం బిక్షపతి, జక్కుల రాందేవ్, అప్పాల సత్యనారాణ, మందాటి రవీందర్, అడ్డగట్ల జ్ఞానేశ్వర్, కాసర్ల భాస్కర్, మురికి రవి, రాజు వెంకన్న, ప్రసంగి ఆవునూరి రామన్న, కొమురయ్య, మురళి,కోటన్న సతీష్, మండ. కిషన్,జగన్ తదితరులు పాల్గొన్నారు .





# గ్రామ కార్యదర్శులకు సన్మానం...

## ఒకిరికి వీడ్కోలు... మరొకిరికి స్వాగతం...

పీపుల్స్‌డైరీ-గణపురం : గాంధీనగర్ గ్రామపంచాయతీ కి బదిలీపై వచ్చిన నూతన కార్యదర్శి షేక్ షఫీని శాలువా తో సన్మానం చేసి పాలకవర్గం స్వాగతం పలికింది. అలాగే గత నాలుగు సంవత్సరాలుగా కార్యదర్శి గా సేవలశీదించిన చంద్రగిరి రాకేష్ ను కూడా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ డా:ఇంజపల్లి శ్రీనివాస్ పాలక వర్గం సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
గురువారం, 17 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 105


# మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

- మహిళా రక్షణ చట్టం కఠినంగా అమలు చేయాలి
- ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు కొండ బోయిన ఉమాపతి



**సింగరేణి (కారేపల్లి) జూన్ 17 (పీపుల్స్ డైరీ):** ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి అమానుష ఘట్టానాలు పునరావృతం కాకుండా మహిళల రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమామతి డిమాండ్ చేశార.బుధవారం కారేపల్లి లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 12 సంవత్సరాల మైనర్ బాలిక అని చూడకుండా కామాంధుడు కర్కశంగా అత్యాచారం చేసి దాన్ని కప్పిపుచ్చుకొనుటకు అపార్ట్మెంట్ పై నుండి కిందికి తోసి హత్య చేయాలని చూశాడని అన్నారు. తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న బాలికకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించటంతో పాటు బాలిక కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని, అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించి మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలికలకు,మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలను అమలు పరచాలని ఆమె కోరారు.దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయనీ, నిందితులని గుర్తించడంలో, గుర్తించిన వారిని శిక్షించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, సామాజిక ఆర్థిక రాజకీయ పలుకుబడులతో దోషులు శిక్షలు నుండి తప్పించుకునే అవకాశం కల్పిస్తున్నందున మహిళలకి రక్షణ లేకుండా పోయి అత్యాచార హత్య ఘటనలు పదే పదే పునరావృతం అవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.అత్యాచార నిరోధక చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయి అందుకు వం-సగా జరుగుతున్న ఘటన లే నిదర్శనం అని ఆమె అన్నారు. ఖమ్మంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని ఆమె ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు ఎస్టీపీలు మంజూరు



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Municipal Administration Department - Engineering - Revised administrative sanction for an amount of Rs. 3705.75 crores (including Land Acquisition, O&M for 5 Years, Annuity Payments and GST on Interest Component of Annuity Payments) for "Sewerage Projects in 101 ULBs in the State of Telangana under SBM 2.0" in supersession of the earlier administrative sanction - Permission to invite tenders in 3 packages under LS contract system with Hybrid Annuity Model along with other approvals - Accorded - Orders- Issued.

MUNICIPAL ADMINISTRATION (Engg.2) DEPARTMENT

G.O.Rt.No.543 Dated:15.05.2026
Read the following:

1. G.O.Rt. No. 343, MA&UD (UBS) Dept., Dt. 29-05-2023.
2. G.O.Rt. No. 388 MA&UD (ENGG.) Dept., Dt. 21-08-2024
3. From the ENC(PH), Hyderabad, Lr.No/T1/SM 2.0/STPs & I&Ds/ 2023-24/1033, Dated:25.07.2025 & 28.11.2025.

****

ORDER :

1. In the GO 2nd read above, Government have accorded administrative sanction for an amount of Rs. 3769.34 Crores (including O&M and Annuity Payments and GST on Interest Component of Annuity Payments) for "Sewerage Projects in 101 ULBs in the State of Telangana under SBM 2.0" and also permission was accorded to invite tenders in single package under LS contract system with Hybrid Annuity Model (35% Upfront and 65% deferred), duly cancelling earlier G.O. in the reference 1st read above, pending acquisition of land, in relaxation of G.O.Ms.No.94, I&CAD(PW-COD) Dept., Dated:01.07.2003 and G.O.Ms.No.1, Finance (Works & Projects-F7) Dept., Dt.25.02.2012.

2. In the letter 3rd read above, the Engineer-in-Chief(PH), Hyderabad has stated that the Government has directed the CDMA, Telangana to address the Government of India (GoI) seeking permission to utilize the GoI share as an upfront payment (35%) during the initial 2-year construction period, with the balance 65% to be paid by the State Government in 10 annuities along with O&M payments. Further, the CDMA, Telangana, vide Lr. Roc. No. E-2128-2021-H1, dated 19-09-2024, addressed to the Joint Secretary & Mission Director, SBM-U, MoHUA, GoI, has requested permission to utilize the Central share of Rs. 463.10 Crores as upfront payment towards construction of STPs

**హుజూరాబాద్, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్లు (ఎస్టీపీలు) ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాతో పాటు మురుగునీటి సమస్య కూడా అధికమవుతోందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపిందన్నారు. ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు కలిపి రూ.45 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందులో హుజూరాబాద్ మున్సిపాలిటీకి రెండు ఎస్టీపీలు, జమ్మికుంట మున్సిపాలిటీకి ఒక ఎస్టీపీ కేటాయించినట్లు చెప్పారు. స్థానికంగా నెలకొన్న మురుగునీటి సమస్యలు, పారిశుద్ధ్య పరిస్థితులను అధికారుల దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఫలితంగానే ఈ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రణవ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగం చేసుకునే అవకాశం కూడా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హుజూరాబాద్, జమ్మికుంట ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ




**హుజూరాబాద్ , జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** నూతన విద్యా సంవత్సరం 2026--27 ప్రారంభమైన సందర్భంగా హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ కలవల సంపత్ కుమార్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అలాగే నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను జాగ్రత్తగా భద్రపరుచుకుని ప్రతిరోజూ అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్య ద్వారానే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సుదీన్, ఉపాధ్యాయులు ఎం. మమత, పర్చా శాంతిలత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్కపల్లి మమత, ఆశా వర్కర్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు కొత్త పుస్తకాలు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల సిబ్బంది వారికి విద్యా సంవత్సరానికి సంబంధించిన సూచనలు అందించారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**హుజూరాబాద్, జూన్ 17, (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా నిర్మితమైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం హుజూరాబాద్ నియోజకవర్గంలోని సిర్సపల్లి గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులు వీణ రాణి, నర్సయ్య నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించారు.కార్యక్రమానికి సిర్సపల్లి గ్రామ సర్పంచ్ పోసాని రామారావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆడెపు ఐలయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.నూతన గృహంలోకి ప్రవేశించిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్‌టీఐ సాధన కమిటీ చెల్పూర్ గ్రామ అధ్యక్షుడిగా ఆకునూరి కుమారస్వామి ఏకగ్రీవ ఎన్నిక



**హుజూరాబాద్, జూన్ 17, (పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండల పరిధిలోని చెల్పూర్ గ్రామంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్‌టీఐ సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మే-రకు జరిగిన ఈ సమావేశంలో చెల్పూర్ గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఆకునూరి కుమారస్వామిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకునూరి కుమారస్వామిని కమిటీ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడు ఎం. రాజు, హుజూరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బండ నరేందర్‌తో పాటు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని చేరవేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్‌టీఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలన కోసం ఆర్‌టీఐ సాధన కమిటీ చేపట్టే కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని ఆకునూరి కుమారస్వామి తెలిపారు.

# చిన్నారుల విద్యా ప్రయాణానికి అక్షరాభ్యాసంతో శ్రీకారం



**హుజూరాబాద్, జూన్ 17, ) పీపుల్స్ డైరీ) :** చిన్నారుల విద్యా జీవితానికి తొలి అడుగుగా భావించే అక్షరాభ్యాస కార్యక్రమం హుజూ రాబాద్ పట్టణంలోని పాటిమీద ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రియమైన చిన్నారులారా, మీరు ప్రారంభిస్తున్న విద్యా ప్రయాణం మీ జీవితాన్ని విజయవంతం చేయాలి. మీరు బాగా చదివి మంచి పౌరులుగా ఎదిగి, మీ తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.అక్షరాభ్యాసం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుండా విద్యా జీవితానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్య పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుగుణ, అంగన్‌వాడీ సూపర్వైజర్ రమ్య, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

# ఏకగ్రీవంగా ట్రాక్టర్ యూనియన్ ఎన్నిక అధ్యక్షులు గా నల్లగాష శ్రీనివాస్



**వీణవంక జూన్ 17( పీపుల్స్ డైరీ) :** మండలం లోని కొండపాక గ్రామంలో బుధవారం ట్రాక్టర్స్ ఓనర్స్ దారి మైసమ్మ మొక్కలు చెల్లించి ట్రాక్టర్ వాహనాలకు పూజలు చేసి అనంతరం ట్రాక్టర్ ఓనర్స్ అందరు కలిసి యూనియన్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన అధ్యక్షులుగా నల్లగాష శ్రీనివాస్ ఉప అధ్యక్షులుగా కోలుగూరి నర్సయ్య క్యాషియర్ గా రామగుండం రాజు కుమార్ కమిటీ మెంబెర్స్ గా కోలుగూరి ఎల్లయ్య, మేడుదుల రాజు లను ఎన్నుకోవడం జరిగింది. నల్లగాష శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాక్టర్స్ ఓనర్స్ నన్ను ఎలాంటి ఏకపక్షం లేకుండ అధ్యక్షులు గా ఎన్నుకున్నందుకు ట్రాక్టర్ ఓనర్స్ అందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రాక్టర్ ఓనర్స్ పాలుగొన్నారు.

# గ్రామీణ యువతకు ఉపాధి లభించేలా శిక్షణ ఇవ్వాలి-మంత్రి సీతక్క



**ఏటూరు నాగారం జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** పలు సంస్థల యజమాన్యాలు ఇస్తున్న శిక్షణ యువతకు ఉపాధి లభించేలా ఉండాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత య-ువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, సాంకేతిక రంగంలో వారికి కొత్త అవకాశాలను అందించే వేదికగా ఈ సంస్థ నిలవాలని ఆకాంక్షించారు. ఇటువంటి సంస్థలు జిల్లాలో యువత భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఉద్యోగాలకై దరఖాస్తుల ఆహ్వానం

**ఏటూరునాగారం జూన్ 17 ( పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ నార్త్, ఎంపీపీ ఎస్ లంబాడి తండా, ఎంపీ యూపీఎస్ నేతాజీ నగర్, ఎంపీపీ ఎస్ చల్పాక, డిఎన్టియుపిఎస్ చిన్నబోయినపల్లి లలో 5 ఇన్స్ట్రక్టర్ ( టీచర్) ఆయా -5 మొత్తం 10 పోస్టులకు అర్హత, ఆసక్తి కలిగిన వ్యక్తులు తమ యొక్క దరఖాస్తు లను నిర్ణీత తేదీలోపు ఎంఈఓ ఆఫీస్ ఏటూర్ నాగారం నందు సమర్పించాలని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇన్స్ట్రక్టర్ ఉద్యోగ నియామకానికి కనీసం ఇంటర్ లేదా సమాన అర్హత గల ఎర్లీ చైల్డ్హుడ్ టీచింగ్ లో అర్హత కలిగి ఉండాలని, ఆయా పోస్టుకు ఏడవ తరగతి ఉత్తీర్ణత, కలిగి ఉండాలని కాగా ఈ పోస్టులకు అదే నివాసం అదే గ్రామపంచాయతీ, అదే మండలం అదే జిల్లా కు చెందినవారై ఉండాలని, 18 సంవత్సరముల నుండి 44 సంవత్సరములు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎస్ టి ఎస్ సి బి సి వర్గాలకు చెందిన వారికి ఐదు సంవత్సరములు చదివింపు కలదని వికలాంగులకు 40 సంవత్సరములు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఎంఈఓ తమ పరిధిలోని తల్లిదండ్రులను ప్రోత్సహించి కనీసం 20 నుండి 25 మంది పిల్లలను చేర్పించాలని డిఇఓ తెలిపారు. ఈ నియామకం పూర్తిగా తాత్కాలికమని సంవత్సరములో 10 నెలలు మాత్రమే చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**అందచేసిన మాజీ సర్పంచ్ పోతుల నరసయ్య**



**వీణవంక జూన్ 17( పీపుల్స్ డైరీ) :** మండలం లోని రెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల సారమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి మృతిరాలి ఇంటికి వెళ్లి నివాళులు అర్పించి మృతిరాలి కుమారులు నాగరాజు, పర్శరాములును వివరాలు అడిగి తెలుసు కున్నారు అలాగే మృతురాలి దహన సంస్కారల ఖర్చుల కింద మృతిరాలి కుమారులకు 2000 రూపాయల ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ గుంటి తిరుపతి, ఉయ్యాల రాజు, బొంగోని ఎల్లయ్య,పైడిమల్ల శ్రీనివాస్ గట్టు కుమార్, చింతల సుమన్ చింతల రాజు,యాదయ్య, శ్రీను,పలువురు గ్రామస్తులు పాలుగోన్నారు

# పోచమ్మ తల్లి దేవాలయ నికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్



**వీణవంక జూన్ 17( పీపుల్స్ డైరీ ) :** మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అచ్చం పల్లె గ్రామంలో పోచమ్మ తల్లి దేవాలయానికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో దేవాలయాలు నిర్మించుకోవడం గ్రామానికి ఎంతో పుణ్యమని గ్రామంలో అందరూ సుభిక్షంగా ఉండాలని అందుచేత గ్రామాలలో దేవాలయలను నిర్మించుకోవడం చాలా సంతోషకరమని గ్రామంలో ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలని.ఈ నిర్మాణానికి గ్రామ ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రముఖులు మహిళలు గ్రామ పంచాయతీ పాలక వర్గం తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ ప్రథమ సంవత్సరము లో ప్రవేశాల కొరకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం



**వీణవంక జూన్ 17( పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల వీణవంక లో 2026-27 విద్యా సంవత్సరానికి కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేర్పించడానికి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ అడ్మిషన్లు పెంచటానికి కృషి చేసారు. కళాశాలలో గల మౌలిక వసతులను బోధన అనుభవం గురించి వివరించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వెంటనే ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేసారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే నాగరాజు



**హసన్ పర్తి, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలతో నిర్మించిన ఇంటికి లబ్ధిదారులు బుధవారం గృహప్రవేశం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజుతో పాటు వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదలందరికీ గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ



**ఆళ్ళపల్లి జూన్ 17(పీపుల్స్ డైరీ) :** ఆళ్ళపల్లి మరియు మర్కోడు ప్రాంతాలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబురావు, బుధవారం నాడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు యూరియా నిలువల తో పాటు విత్తనాల నాణ్యతను పరిశీలించారు ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందన్న రైతులు పత్తి చేలలో అంతర పంటగా కంది పంట సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రైతులకు సూచించారు యూరియా విక్రయాలను యాప్ ద్వారా ప్రారంభించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కుమార్ రాజా పాల్గొన్నారు

## వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**హసన్‌పర్తి, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను పల్వెల్పుల గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. హసన్‌పర్తి మండల కార్యదర్శి మంద సుచందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు మాట్లాడుతూ.. ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పథకం బలోపేతం, కూలీలకు గిట్టుబాటు రేట్లు, కార్మికుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు వేలు రజిత, గ్రామ కమిటీ కార్యదర్శి పల్లె చందన, ప్రవీణ్, భూలక్ష్మి, కేవీపీఎస్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వంగర గ్రామంలో బాలవికాస వాటర్ ప్లాంట్ ప్రారంభం-సర్పంచ్ గజ్జల సృజన రమేష్



**భీమదేవరపల్లి జూన్ 17 (పీపుల్స్ డైరీ ):** వంగర గ్రామ పంచాయతీ పరిధిలోని పీవీ నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలవికాస వాటర్ ప్లాంట్‌ను వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో బాలవికాస సంస్థ సహకారంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు అత్యంత అవసరమని, ఈ ప్లాంట్ ద్వారా పీవీ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. అలాగే ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన బాలవికాస సంస్థ, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ, గ్రామ ప్రజాప్ర తినిధులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే దిశగా ఈ వాటర్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు కేడం లింగమూర్తి, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు రఘునాయకుల మహేష్ రెడ్డి, మారం సతీష్, గజ్జల రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగిరెడ్డి సతీష్, బాలవికాస వాటర్ ప్లాంట్ కమిటీ సభ్యులు కొండ తిరుపతి, మాజీ సర్పంచ్ రఘునాయకుల వెంకటరెడ్డి, నల్లగోని ప్రభాకర్, గ్రామ పెద్దలు చెప్యాల తిరుపతిరెడ్డి, సతీష్ రెడ్డి, చంద్రారెడ్డి, కాల్వ సంపత్, ఒల్లాల రాజమౌళి, రవి, మహేష్, సంజీవ్, శ్రీనివాస్, ఇందిరా, మంజుల, వనజ, రాజయ్య, స్వామి, పరమేష్, బత్తుల వెంకటమ్మ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రాంపల్లి మహంకాళి ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

- **యువ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి సేవాభావానికి ప్రశంసలు**



**మేడ్చల్/కీసర, జూన్ 17 (పీపుల్స్ డైరీ):** ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి మరోసారి సేవాభావాన్ని చాటుకున్నారు. రాంపల్లిలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధి పనుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఆలయంలో మౌలిక సదు-పాయాల మెరుగుదల, నిర్మాణ పనులు చేపట్టడం, భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కమిటీ సభ్యులు కౌకుట్ల జీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీవన్ రెడ్డి, ఆధ్యాత్మిక కేంద్రాలు కేవలం పూజా స్థలాలే కాకుండా సమాజానికి స్ఫూర్తినిచ్చే కేంద్రాలని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకే ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు ధార్మిక, సామాజిక కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గండి ఓం ప్రకాష్ గౌడ్, ఉపాధ్యక్షుడు క్యాసారం సురేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నెల్లుట్ల విజయ్ భాస్కర్, కార్యదర్శి జమ్మల సందీప్ గౌడ్, కోశాధికారి దొడ్డి బాల్ నరసింహ, కార్యవర్గ సభ్యులు ఏనుగు మహేందర్ రెడ్డి, జమ్మల ప్రశాంత్ గౌడ్, కావడి నరసింహ, నక్కిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి విశేషంగా సహకరించిన కౌకుట్ల జీవన్ రెడ్డికి కమిటీ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భక్తుల సంక్షేమం కోసం చేపట్టే సేవా కార్యక్రమాల్లో ఆయన సహకారం మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఈ-కేవైసీ చేయకపోతే ఇబ్బందులు తప్పవు..!

- **జూన్ 30 గడువు.. 4.32 లక్షల ఎల్పీజీ వినియోగదారులు ఇంకా పెండింగ్**

**మేడ్చల్ జూన్ 17(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వంటగ్యాస్ వినియోగదారుల ఈ-కేవైసీ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి గ్యాస్ కనెక్షన్‌దారుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉండగా, జిల్లాలో ఇంకా లక్షలాది మంది వినియోగదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. దీంతో జూన్ 30 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేసింది. జిల్లాలో మొత్తం 14,49,460 ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఇంకా సుమారు 4,32,000 మంది వినియోగదారులు ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ పౌరసరఫరాలు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అధ్యక్షతన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, మేనేజర్లు పాల్గొని ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసే అంశాలపై చర్చించారు.

### ఈ-కేవైసీ ఎందుకు అవసరం?

ఎల్పీజీ కనెక్షన్ కలిగిన ప్రతి వినియోగదారుడి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో సక్రమంగా ఉండేందుకు ఈ-కేవైసీ కీలకంగా మారింది. నకిలీ కనెక్షన్లను గుర్తించడం, అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీలు, ప్రభుత్వ ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం. అలాగే భవిష్యత్తులో డిజిటల్ సేవలను మరింత పారదర్శకంగా అమలు చేయడంలో ఇది సహాయపడనుంది.

### గడువులోగా పూర్తి చేయాలి

జూన్ 30, 2026లోగా ప్రతి ఎల్పీజీ వినియోగదారుడు తన సమీప గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్, మొబైల్ నంబర్ తదితర వివరాలతో బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. అవగాహనతోనే పూర్తి స్థాయి విజయము జిల్లాలో లక్షలాది మంది వినియోగదారులు ఇంకా ఈ-కేవైసీ చేయకపోవడం



ఆందోళన కలిగిస్తున్న అంశంగా అధికారులు భావిస్తున్నారు. గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించాలని గ్యాస్ ఏజెన్సీలకు సూచించారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వ సేవలను సులభంగా పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ-కేవైసీ పూర్తి చేయడం పౌరసరఫరాల శాఖకు అత్యంత ప్రాధాన్యత అంశంగా మారింది.

## ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సంబు ప్రభాకర్



ఎప్పుడు ప్రజాసేవకే తన ప్రయాణం అంటూ ప్రజలతో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే నాయకుడు మర్రి రాజశేఖర్ రెడ్డి అని బి.ఆర్.టి.యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ కొనియాడారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బోయినపల్లిలోని తన నివాసంలో రాశేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో బి.ఆర్.టి.యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ పాల్గొన్నారు. రాజశేఖర్ రెడ్డి తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ప్రభా కర్ మాట్లాడుతూ అటు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడే గొప్ప నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న నాయకుడని తెలిపారు. ఇలాంటి నాయకులు ఉన్నన్ని రోజులు ప్రజలకు ఎలాంటి సమస్యలు రావని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు తోడుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు అని అన్నారు. అరుంధతి హాస్పిటల్ ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఎంతోమంది కార్మికులకు, ఆశ వర్కర్లకు, అంగన్వాడి టీచర్లకు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలిచిన నేత రాజశేఖర్ రెడ్డి అని ప్రభాకర్ కొనియాడారు.

## జమ్మికుంట మండల ఫోటో స్టూడియోల బంద్ జయప్రదం

**నూతన ధరలు రేపటి నుండి అమలు**



**జమ్మికుంట, జూన్ 17:పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మండలంలోని ఫోటో స్టూడియోల యజమానులు చేపట్టిన బంద్ విజయవంతమైందని, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఫోటోగ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎండి. ముస్తఫా పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన ఐకమత్యాన్ని, సహాయ సహకారాలను కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుతం మార్కెట్‌లో ముడిసరుకుల ధరలు, ప్రింటింగ్ ఖర్చులు మరియు స్టూడియో సంబంధిత వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ భారాన్ని దృష్టిలో ఉంచుకుని, తప్పనిసరి పరిస్థితుల్లో ఫోటో స్టూడియోల సేవల ధరలను స్వల్పంగా సవరించడం జరిగింది. ఈ నూతన ధరలు రేపటి (జూన్ 18) నుండి మండలంలోని అన్ని స్టూడియోలలో అమలులోకి వస్తాయి" అని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేందర్, జమ్మికుంట మండల అధ్యక్షులు ఎండి. ముస్తఫా, ఉపాధ్యక్షులు యండి. అజార్, ప్రధాన కార్యదర్శి దొడ్డె ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు పొనగంటి విజయ్రాజులతో పాటు ఫోటోగ్రాఫర్లు రత్నకుమార్, రాంబాబు , రవి, సునీల్ , ఉపేందర్, తోట రాజేందర్, గౌతం, నాని, శ్రీను, ప్రవీణ్, అంబాల హరీష్, సురోజు శ్రీనాథ్, మడుపు సంతోష్, జానీ, ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్కల్ లో ఇసుక రీచ్ ను ప్రారంభించిన వొడితల ప్రణవ్

- దశాబ్దాల కల నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రణవ్
- ప్రభుత్వ నిర్ణయంతో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజల్లో వెల్లివిరిసిన ఆనందం,జై కాంగ్రెస్ జై ప్రణవ్ అంటూ దద్దరిల్లిన ఇసుక ప్రాంగణం
- స్వయం ఉపాధి వైపు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు



**వీణవంక జూన్ 17(పీపుల్స్ డైరీ ) :** మండలం లోని కోర్కల్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుక రిచ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దోచుకొని దాచుకుంటే,కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంపద సృష్టించి పేదలకు పంచుతున్నాం ఇసుక విషయంలో గత ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించి సంవత్సరానికి 400 కోట్ల ఆదాయం తీసుకొస్తే,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కల్పిస్తూ సుమారు పదకొండు (1100) వందల కోట్ల పై చిలుకు ఆదాయాన్ని ప్రణాళిక బద్ధంగా ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తున్నామని వారు అన్నారు. కోర్కల్ గ్రామంలో ప్రసిద్ధ మహిమకలిగిన లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నిర్ణయంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పెద్ద ఎత్తున ప్రభుత్వానికి దీనికి అన్ని విధాలుగా కృషి చేసిన ప్రణవ్ బాబు కు మద్దతుగా భారీ ఎత్తున జై కాంగ్రెస్ జై ప్రణవ్ అంటూ నినాదాలు చేశారు.ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత ప్రజల కోరికను తాము నెరవేర్చామని ప్రభుత్వం సూచించే యాప్ విధానాలు పాటించి ఇసుక సరఫరా చేసుకోవాలని కోరారు.ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సాయం తో పాటు న్యాయం చేస్తామని ఇప్పుడు ఆది రుజువయ్యింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కోర్కల్ గ్రామ సర్పంచ్,ఇసుక రీచ్ అధికారి,వీణవంక మండల కాంగ్రెస్ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముత్తారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ

## ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్

**భీమదేవరపల్లి జూన్ 17 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండలం ముత్తారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో ప్రతిభ కనబరచాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలను చేరుకోవ చ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు అంది స్తున్న మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు పాటించాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమా ణాల మెరుగు దలకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరిం చాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి అవ సరమైన సహాయ సహకారాలు అందించేందుకు



ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని, ఉపాధ్యా యులు రాజిరెడ్డి, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదివాసుల ఆత్మగౌరానికి భంగం- రాళ్లకుంట చెరువులో భూకబ్జా కలకలం

- ఆదివాసుల పేరుతో అక్రమాలకు తెరలేపారని గండేపల్లి సత్యం ధ్వజం
- సర్వే నెం. 209లో భూకబ్జాలు:
- రాళ్లకుంట చెరువు శివారు భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపణ.
- కబ్జాదారుల పేర్లు బయటపెట్టిన గండేపల్లి సత్యం.

**ఏటూరు నాగారం జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా ఏటూరు నాగారం ఆకుల వారి గణపురంలోని రాళ్లకుంట చెరువు సర్వే నెంబర్ 209 భూకబ్జాలకు పాల్పడుతున్న బడే సులోచన, శమంతకమణి, పెనక నాగమణిపై నేరుగా గండేపల్లి సత్యం విమర్శలు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని మంటగలుపుతున్నారు.కొందరి చర్యలతో మొత్తం జాతికే చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల జోక్యం కోరిన స్థానికులు. రెవెన్యూ, అటవీ శాఖ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుకు ముప్పు పొంచి ఉంది. కబ్జాల వల్ల వర్షాకాలంలో ముంపు ప్రమాదం, భూగర్భ జలాలకు నష్టమని గ్రామస్తుల ఆందోళన. ఈ భూకబ్జాలకు బడే సులోచన, శమంతకమణి, పెనక నాగమణి అనే వ్యక్తులు పాల్పడుతున్నారని గండేపల్లి సత్యం ఆరోపించారు. వీరు ఆదివాసుల పేరు చెప్పుకొని చట్టవిరుద్ధంగా భూములను కబ్జా చేస్తున్నారని ఆయన విమర్శించారు.

### గిరిజనుల ఆత్మగౌరవానికి భంగం

ఇలాంటి చర్యల వల్ల నిజమైన ఆదివాసుల జాతి మీద ఇతరులకు నమ్మకం పోతోంది. గిరిజనుల ఆత్మగౌరవాన్ని మంట గలుపుతున్నారు. ఆది వాసీలు అంటే చట్టాన్ని గౌర వించే వారు, ప్రకృతిని కాపాడే వారు. కానీ కొందరి స్వార్థం వల్ల మొత్తం జాతికే చెడ్డ పేరు వస్తోంది. అని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.



### అధికారులకు విజ్ఞప్తి:

సర్వే నెంబర్ 209లో జరుగుతున్న అక్రమాలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు శివారు భూములను, ప్రభుత్వ భూములను కాపాడాలని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### స్థానికుల స్పందన:

రాళ్లకుంట చెరువు చుట్టుపక్కల భూములను ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో చెరువుకు ప్రమాదం ఏర్పడుతుందని, భూగర్భ జలాలు కూడా దెబ్బతింటాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతున్నారు.

### మహాలక్ష్మిమీడియాతో మాట్లాడుతూ

చాలు... ఇక చాలు. ఈ రాళ్లకుంట చెరువు మన తాతల కాలం నుంచి మన బతుకుదెరువు. ఈ నేల మీద మన హక్కును ఎవరూ కాలరాయలేరు. ఆదివాసులం అని చెప్పుకుంటూ, అదే జాతి పరువు తీసే పనులు చేస్తున్నారు కొందరు. ఇది మన జాతికే అవమానం. వినండి... ఆదివాసుల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా, మన ఏటూరు నాగారం పరువు తీసేలా ఎవరైనా ప్రవర్తిస్తే మహాలక్ష్మి ఊరుకునేది లేదు. చెరువు భూమి జోలికొస్తే, చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండానే చట్టంతోనే బుద్ధి చెబుతాం. ఇది నా మాట కాదు... ఈ నేల మీద పుట్టిన ప్రతి ఆదివాసీ బిడ్డ శపథం!" ఈనెలపై గిరిజనులు, గిరిజనేతరులు కొన్ని వందల సంవత్సరాల నుంచి అన్నదమ్ముల కలిసి ఉంటున్నాము దయచేసి మా మధ్య గొడవలు పెట్టవద్దు అని ఆమె వేడుకున్నారు.

# 'బడిబాట" కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు

- ముందడుగు వేస్తే ప్రభుత్వ పాఠశాలలపై పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత భరోసా -మాడుగుల అజిత్ కుమార్

**భీమదేవరపల్లి జూన్ 17 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండలంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "బడిబాట" కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలంటే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని ముల్కనూర్ అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు, బీజేపీ మండల నాయకులు మాడుగుల అజిత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, విద్యార్థుల చేరికలను పెంచడానికి "బడిబాట" కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరగాలంటే భీమదేవరపల్లి మండలంలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రస్తుతం కొనసాగుతున్న ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే అది సమాజానికి ఒక గొప్ప సందేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు చెప్పే మాటల కంటే చూపించే ఆచరణనే ఎక్కువగా విశ్వసిస్తారని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు స్వయంగా ముందడుగు వేసి ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకుంటే సాధారణ ప్రజల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం మరింత పెరిగి, ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కూడా చదువుతున్నారనే భావన ఏర్పడితే పాఠశాలల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల శ్రద్ధ మరింత పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ఫర్నిచర్, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల భద్రత, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలల పర్యవేక్షణ వంటి అంశాల్లో మరింత బాధ్యతతో చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో జవాబుదారీతనం పెరిగి, విద్యా నాణ్యత మరింత మెరుగుపడటమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలలు అన్ని వర్గాల ప్రజలు విశ్వాసంతో తమ పిల్లలను చేర్పించే స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అనేక పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ఆశ్రయిస్తూ అధిక ఫీజుల భారం మోస్తున్నారని మాడుగుల అజిత్ కుమార్ అన్నారు. విద్య కోసం కుటుంబాలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలిస్తే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని, ఫలితంగా పేద, మధ్యతరగతి



కుటుంబాలు ఖరీదైన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి క్రమంగా తగ్గుతుందని తెలిపారు. దీనివల్ల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెరిగి, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ విద్యపై మరింత భరోసా కల్పించిన వారవుతారని పేర్కొన్నారు.చివరగా, ఇది ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అంటున్నది కాదని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరగాలని, "బడిబాట" కార్యక్రమం మరింత విజయవంతం కావాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో తనకు వచ్చిన ఒక సానుకూల ఆలోచన మాత్రమేనని ముల్కనూర్ అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు, బీజేపీ మండల నాయకులు మాడుగుల అజిత్ కుమార్ స్పష్టం చేశారు.

# రాజీయే రాజమార్గం - ఎస్సై దివ్య

## ఈ నెల 20న జాతీయ లోక్ అదాలత్



**భీమదేవరపల్లి జూన్ 17 (పీపుల్స్ డైరీ ) :** చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని వంగర ఎస్సై దివ్య కక్షిదారులకు సూచించారు. ఈ నెల 20వ తేదీ శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఎస్సై దివ్య మాట్లాడుతూ, "రాజీయే రాజమార్గం" అని, జుడిషియల్ డిపార్ట్‌మెంట్ కల్పించిన ఈ అద్భుతమైన అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు.రాజీ పడదగిన కేసులు క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబపరమైన, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు విద్యుత్ చౌర్యం కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తమ కేసుల్లో రాజీ పడాలని ఆసక్తి ఉన్నవారు వెంటనే వంగర పోలీస్ అధికారులను సంప్రదించి,ఈ నెల 20న జరిగే లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్సై దివ్య కోరారు.

# సీతంపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాలు

## ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ళు మేళా తాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు..



**ఇల్లంతకుంట జూన్ 17 పీపుల్స్ డైరీ :** ఇల్లంతకుంట మండలం సీతంపేట గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలను కన్నుల పండుగగా నిర్వహించారు డబ్బు చెప్పులు మేళా తాళాలతో గ్రామంలోని గురు వీధుల గుండా మహిళలు నెత్తిన బోనమెత్తి శివశక్తుల విన్యాసాలతో పెద్దమ్మ తల్లి కి బోనాలను సమర్పించారు ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒకరు పెద్దమ్మ తల్లిని ఆరాధిస్తారని పెద్దమ్మతల్లి కృప కటాక్షాలు ఎల్లవేళలా గ్రామం పై ఉండి రైతులకు అండగా నిలిచే తల్లి పెద్దమ్మ తల్లి అని అన్నారు గ్రామంలో పాడిపంట గుడ్డు గోదా చల్లగా ఉండి గ్రామం సుభిక్షంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామంలోని వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చెందాలని వర్షాలు పడితే చెరువులు కుంటలు నిండి మచ్చ సంపద అభివృద్ధి చెందుతుందని అందుకొరకే ఈ గ్రామంలో ప్రతి ఏటా మృగశిల వెళ్లిపోయిన తర్వాత పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ రవీందర్, ఉప సర్పంచ్ .పిట్టల రాజు ముదిరాజ్ కుల సంఘ అధ్యక్షులు సాయిలు, రాజేష్, మహేష్,, మల్లేష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్ అంతరాయం

**మేడ్చల్, జూన్ 17(పీపుల్స్ డైరీ) :** చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా జూన్ 18న మేడ్చల్ రూరల్ విద్యుత్ విభాగ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.అత్వెల్లి సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ దాబిల్‌పూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని దీంతో డబిల్‌పూర్ గ్రామం ప్రభావితమవుతుంది.రావల్‌కోల్ సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ రావల్‌కోల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ సమయంలో రావల్‌కోల్ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాగే రావల్‌కోల్ సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ చెరువుకట్ట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. దీంతో చెరువుకట్ట వ్యవసాయ ప్రాంతంలోని వినియోగదారులు ప్రభావితమవుతారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి శాఖకు సహకరించాలని ఏఈ (ఆపరేషన్) మేడ్చల్ రూరల్ కోరారు.

# కవల చిన్నారుల పాల కోసం 5,000 ఆర్థిక సహాయం



**సింగరేణి, (కారేపల్లి) జూన్ 17(పీపుల్స్ డైరీ) :** మానవతా దృక్పథంతో కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు కవల చిన్నారుల పాల కోసం ₹5,000 ఆర్థిక సహాయం అందజేశారు.స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సూచన మేరకు రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చీమలవారి గూడెం గ్రామానికి చెందిన చెవుల శ్రీను మనవడు, మనవరాల్లకు కన్నతల్లి లేని కవల చిన్నారుల పోషణ కోసం ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల తన సామాజిక బాధ్యతను గుర్తించి సహాయం చేసిన గుడిపూడి తిరుమల రావుకి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ దేవస్థాన చైర్మన్ అడ్డగోడ ఐలయ్య యాదవ్, రేగులగూడెం సర్పంచ్ మోతి వీరాస్వామి, రేగుల గూడెం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,కాంగ్రెస్ నాయకులు జక్కుల కుమార్, శషేక్ హాజిమియా, పొట్లకాయల మహేష్, వరికోర్ల వీరభద్రం, సామినేని తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ

కరీంనగర్

గురువారం, 17 జూన్ 2026

సంపుటి : 18, సంచిక : 105



# వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ సింగరేణి మండల పర్యటన



**సింగరేణి,(కారేపల్లి) జూన్ 17(పీపుల్స్ డైరీ)** : వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ గురువారం (18-06-2026) సింగరేణి మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.పర్యటన వివరాలు: ఉదయం 10:00 గంటలకు -- సీతారాంపురం గ్రామంలో వివాహ వేడుకల్లో పాల్గొంటారు..ఉదయం 11:00 గంటలకు -- మాదారం గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం.ఉదయం 11:30 గంటలకు -- మాదారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం. మధ్యాహ్నం 12:00 గంటలకు-ఇందిరా మహిళా సమాఖ్య వి.ఓ. భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం.మధ్యాహ్నం 12:30 గంటలకు -- మాదారం గ్రామంలో సింగరేణి మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొనడం జరుగుతుంది. భోజన విరామం మధ్యాహ్నం 3:00 గంటలకు -- సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా నాయకులు కోరడమైనది.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

## ప్రజలు అప్రమత్తంగా ఉండా - సైదాపూర్ ఎస్సై కొప్పుల స్వాతి



**సైదాపూర్ జూన్ 17 ( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లోని పెరిక పల్లి గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది గ్రామంలోని పోతరాజు వీరయ్య అనే పెంకుటిల్లు తాళమేసి ఉండడంతో ఎవరు లేని సమయంలో ఇంటి తాళం పగలగొట్టి విలువైన వస్తువులను దొంగలించినట్లు ఇంటి యజమాని వీరయ్య వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి చిందర వందరగా ఉ ండడంతో సామాగ్రి దొంగలించారని పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వెంటనే చోరీ జరిగిన పెంకుటిల్లును పరిశీలించి దొంగలను గుర్తించేందుకు గ్రామంలోని సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు ప్రారంభించి దొంగలను పట్టుకునేందుకు ఆధారాలు స్వీకరిస్తున్నట్లు ఎస్సై స్వాతి తెలిపారు

# పోతిరెడ్డిపల్లి లో ఘనంగా అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**వీణవంక జూన్ 17(పీపుల్స్ డైరీ ) :** పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ ఉపసర్పంచ్ రాపర్తి సంధ్య కొమురయ్య పాల్గొని చిన్నారులతో మొదటి అక్షరాలు వ్రాయించి అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. చిన్నారులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను చేరాలని మంచి గురువులతో విద్య నేర్చుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్లపెల్లి పుష్పలీల చేపూరి శ్రీకాంత్ అంగన్వాడీ టీచర్లు ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ డైరీ దినపత్రిక కథనానికి అధికారుల స్పందన

## క్షేత్రస్థాయిలో అధికారుల విచారణ కొలతల ప్రకారం ఉపాధి హామీ కూలీలకు వేతనం ఇస్తాం- ఏపీవో రాణి వెల్లడి



**సైదాపూర్ జూన్ 17 ( పీపుల్స్ డైరీ):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామంలోని రైతులకు చెరువు మట్టిని టాక్టర్ ద్వారా రైతుల పొలాలకు పంపిణీ చేస్తున్న కూలీలకు తక్కువ వేతనం వస్తుందని నిరసన వ్యక్తం చేసిన కూలీలకు సర్పంచ్ బబిత తో కలిసి ఏపీఓ రాణి పని ప్రదేశంలో పనికి తగ్గ వేతనం కల్పిస్తామని జరిగిన దానిపై విచారణ చేసి కూలీలకు న్యాయం చేస్తామని ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఈసీ టెక్నికల్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలు తదితరులు ఉన్నారు

# గిరిజనేతరులను ఇక్కడి నుంచి ఎవరు దూరం చేయలేరు

- ఇక్కడి భూములు ఆక్రమిస్తామంటే ఊరుకోం
- రాళ్లకుంట చెరువు సర్వే నంబర్ 209లో ఆక్రమాలు
- బడే సులోచన, శమంతకమణి, పెనక నాగమణులపై గండేపల్లి సత్యం ధ్వజం
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, అటవీ శాఖకు విజ్ఞప్తి
- తమ చెరువు భూమి జోలికొస్తే ఊరుకునేది లేదన్న మహా లక్ష్మి




**ఏటూరునాగారం జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి గణపురంలోని రాళ్లకుంట చెరువు శివారు భూములు కబ్జాకు గురవుతున్నాయంటూ ఆరోపణలు రేకెత్తుతున్నాయి. సర్వే నంబర్ 209లో గల ప్రభుత్వ భూమిని, చెరువు శివారు ప్రాంతాలను ఆదివాసుల పేరుతో కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని గండేపల్లి సత్యం విమర్శలు చేశారు. బడే సులోచన, శమంతకమణి, పెనక నాగమణిలు ఆదివాసులమనే ముసుగులో చట్టవిరుద్ధంగా భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. కొందరి స్వార్థపూరిత చర్యల వల్ల గిరిజనుల ఆత్మగౌరవం మంటగలుస్తోందని, చట్టాన్ని గౌరవించే, ప్రకృతిని కాపాడే ఆదివాసీ జాతికి వీరి వల్ల చెడ్డపేరు వస్తోందని అన్నారు. రాళ్లకుంట చెరువు పరివాహక ప్రాంతంలోని భూములను కబ్జా చేయడం వల్ల రాబోయే వర్షాకాలంలో ముంపు ముప్పు పొంచి ఉందని, భూగర్భ జలాలు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## చట్టంతోనే బుద్ధి చెబుతాం

ఈ వ్యవహారంపై మహాలక్ష్మి మాట్లాడుతూ రాళ్లకుంట చెరువు మా తాతల కాలం నుంచి మా జీవనాధారం. ఈ నేల మీద మా హక్కును ఎవరూ కాలరాయలేరు. ఆదివాసుల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా, మా ఊరి పరువు తీసేలా ఎవరైనా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని మహాలక్ష్మి ఘాటుగా హెచ్చరికలు చేశారు. చెరువు భూమి జోలికొస్తే, చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండానే చట్టపరంగానే బుద్ధి చెబుతామంటూ పేర్కొన్నారు. గిరిజనులు, గిరిజనేతరులు వందల ఏళ్లుగా ఇక్కడ కలిసి ఉంటున్నామని, దయచేసి తమ మధ్య చిచ్చు పెట్టవద్దని ఆమె కోరారు. సర్వే నంబర్ 209లో జరుగుతున్న అక్రమాలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సత్యం డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెట్టి, ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం-కవ్వంపల్లి జోలికొస్తే ఖబడ్దార్ బాలకిషన్

- అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను హెచ్చరించిన కాంగ్రెస్ నేతలు



**నంగునూరు, జూన్ 17:** అరేయ్ బిడ్డా రసమయి బాలకిషన్ అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం జాగ్రత్త అంటూ నంగునూరు మండల ఏఎంసీ చైర్మెన్ దేవులపల్లి యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, కాంగ్రెస్ నాయకులు కాటం కిషన్ లు మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను హెచ్చరించారు. నంగునూరులో బుధవారం వారు మాట్లాడుతూ మంగళవారం మానకొండూరు నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ మీటింగ్లో తమ డైనమిక్ లీడర్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మెన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమీషన్ల దొంగ రసమయి బాలకిషన్ తస్మాత్ జాగ్రత్త అంటూ ఫైర్ అయ్యారు. నోరు ఉంది కదా అని అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తాం జాగ్రత్త బిడ్డా అని హెచ్చరించారు. కవ్వంపల్లి సత్యనారాయణపై, కాంగ్రెస్ పార్టీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, చూస్తూ ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలు మీరు పాలనను గాలికొదిలేసి ఫాంహౌస్ లు కట్టుకొని అందులో పండుకొని ఎంజాయ్ చేస్తేనే కదా మానకొండూరు నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని గెంటేసి మా నాయకుడు కవ్వంపల్లి సత్యనారాయణని గెలిపించారని గుర్తుచేశారు. కాంట్రాక్టులకు, కమిషన్లకు కక్కుర్తి పడి కట్టిన ఒక్క కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టుని పట్టుకొని అగ్గిపెట్టె హరీష్ రావు, నేను ప్రాజెక్టు కట్టినా అని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎస్ఆర్ఎస్పి, కరీంనగర్, నాగార్జున సాగర్, దేవాదుల, శ్రీశైలం, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్ ఇలాంటి ప్రాజెక్టులు మీ అయ్య కట్టాడా అని నిలదీశారు. గత 60 సంవత్సరాల కాలం నుండి తెలంగాణను అభివృద్ధి చేసింది కాంగ్రెస్సే అని, ఇప్పుడు చేసేది కూడా కాంగ్రెస్సే గుర్తు పెట్టుకో కమీషన్ల రసమయి అంటూ చురకలంటించారు. తెలంగాణ రాష్ట్ర కళాకారుల సాంస్కృతిక శాఖ చైర్మెన్ గా 500 పోస్టులు అమ్ముకున్న దద్దమ్మవు నువ్వు కదా.. సిగ్గులేని రసమయి.. నువ్వు నియోజకవర్గంలో పీకి కట్టలు కట్టింది ఏం లేకనే కదా నిన్ను బండకేసి కొట్టి మా డైనమిక్ లీడర్ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు కష్టం రాగానే నేను ఉన్నానంటూ నిత్యం ప్రజలతో మమేకమై అందుబాటులో ఉంటున్నారని కాబట్టే మా నాయకున్ని గెలిపించారని చెప్పారు. ఇంకా పది సంవత్సరాలు అయినా మీ బీఆర్ఎస్ తెలంగాణలో అధికారంలోకి రాదని, మీ పతనం ఎప్పుడో మా నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో అంతమయిపోయిందని, ప్రజాపాలనను ప్రజలు అశీర్వదిస్తున్నారని అన్నారు. అందుకే మీకు ఎంపీ ఎలక్షన్స్ లో గుండుసున్నా ఇచ్చారన్నారు. సర్పంచ్ ఎలక్షన్లో, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పత్తా లేకుండా పోయారని, రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్స్ లో కూడా మీకు వచ్చేది గుండుసున్ననే మిస్టర్ రసమయి బాలకిషన్, ఇకనైనా అడ్డగోలుగా మాట్లాడడం బంజేసుకో, లేదంటే నిన్ను ఉరికించుకుంటూ కొట్టే రోజులు వస్తాయని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# పారిశుద్ధ్యమా..నీ జాడెక్కడా?-99 రోజుల ప్రణాళిక గాలికి

- పెద్ద కోమటిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అపరిశుభ్రత
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్న పంచాయతీ పాలకవర్గం
- సీజనల్ వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్న ప్రజలు



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 17 :** రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికకు పెద్ద కోమటిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం తూట్లు పొడుస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామంలో పంచాయతీ పాలకవర్గం పట్టింపులేని ధోరణితో వ్యవహరిస్తుంది. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాల్సిన పంచాయతీ పాలకవర్గ కార్యాలయ ఆవరణమే స్వయంగా అపరిశుభ్రతకు నిలయంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న రీతిలో ప్రజాదర్బార్, 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తూ..విద్యా, వైద్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పదే పదే అధికారులను ఆదేశించినప్పటికీ పెద్ద కోమటిపల్లి పంచాయతీ పాలకవర్గం పెడచెవిన పెట్టడం తీవ్ర విమర్శలకు గురిచేస్తుంది.

## పంచాయతీ కార్యాలయం చెత్తకుప్పలకు నిలయం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణం చెత్తకుప్పలకు నిలయంగా మారింది. పంచాయతీ పాలకవర్గం పట్టించు కోకపోవడంతో అక్కడ ప్రజలకు చెత్తా, చెదారం దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సంభవిస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన పంచాయతీ పాలకవర్గ కార్యాలయం సాక్షాత్తు చెత్త కుప్పలకు దర్శనమివ్వడంతో పెద్ద కోమటీ పల్లి గ్రామంలో అసలు పంచాయతీ పాలకవర్గం ఉన్నట్లా..? లేనట్లా..? అని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీలను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో పంచాయతీ పాలకవర్గాల ఇష్టారాజ్యం కొనసాగు తోందని పలు విమర్శలు లేవనెత్తుతున్నాయి. గ్రామపంచాయతీలలో చెత్త నిలువ ఉండకుండా ట్రాక్టర్ ను కొనుగోలు చేసి, పారిశుద్ధ్య కార్మికులను నియమించి, కార్మికులకు వేతనాలను మంజూరు చేస్తున్నప్పటికీ, ఈ తంతు కొనసాగడం వెనుక మండల అధికారుల వైఫల్యం ఉందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెద్ద కోమటీ పల్లి గ్రామాన్ని అధికారులంతా సందర్శించి..గ్రామంలో చెత్తాచెదారం నిల్వలు లేకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎరువుల గోదాంలు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 17 :** జగిత్యాల జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా అప్ ద్వారా విక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు కావలిసిన యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గోదాముల నిర్మాణానికి సంబంధించి పనులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూరు గ్రామంలో గోదాముల నిర్మాణానికి సంబంధించి ప్రదిపాదిత స్థలాన్ని పరిశీలించారు.జిల్లాలో పెరుగుతున్న పంటల దిగుబడికి అనుగుణంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాబార్డ్ సహకారంతో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాముల నిర్మాణం తో జాబితాపూరు ప్రాంతం జిల్లాలో ధాన్యం నిల్వ కేంద్రం గా మారుతుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని పరిశీలించారు. అదేవిధంగా అంతర్గాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి చెరుకు మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, ఏడిఏ నాయక్, రూరల్ తాశీల్దార్ హకీం తదితరులు ఉన్నారు.

# వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

## పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి చేతుల మీదుగా పూజలు...

**మట్టెవాడ, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత మూడు రోజులుగా జరపబడుచున్న "ధ్వజస్తంభ ప్రతిష్ఠ" బుధవారం ఉదయం 8-36 నిమిషాలకు పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి చేతుల మీదుగా జరపడంతో సుసంపన్న మైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఇరిగేషన్ ఎస్.ఈ హరి వెంకటరామ ప్రసాద్, ప్రముఖ వితరణశీలి తొట్రెడ్డి హృదయ్ కుమార్ రెడ్డి - అర్చన పంపతులు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ కృష్ణ ప్రసాద్, దాతలు జారతి వెంకటేశ్వర్లు, గోపాల విజయ్ కుమార్, పుప్పాల శివశంకర్, మూల రాంమూర్తి, బొమ్మగాని కృష్ణమూర్తి, పురం సతీష్ కుమార్లతో పాటు. దేవాలయ చైర్మన్ డాక్టర్ బి. శివ సుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి రామేశ్వర్ రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, సిరివోలు శ్రీధర్ రావు, భక్తులు, దాదాపు 10 వేల మంది పాల్గొన్నారు. ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులందరికీ భద్రకాళీ భక్త సేవాసమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ నేతృత్వంలో ఆలయానికి విచ్చేసిన భక్తులంరికీ అన్నప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమం భద్రకాళి శేషు నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థుల సమన్వయంతో వర్ధమాన ఆగమ శాస్త్ర పండితులు గుమడవెల్లి గణేశ్ ఆత్రేయ శర్మ కన్నుల పండుగగా ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం ఆకాశాన్ని తాకుతోందా అన్నట్టుగా కనబడుతున్న ధ్వజస్తంభాన్ని దర్శించిన భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. ఈ రోజు ఆలయం అంతా భక్తుల భక్తిపారవశ్యంతో మారుమ్రోగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్ని ఏర్పాట్లు ఈఓ రామల సునీత పర్యవేక్షించారు.







## నాటిన మొక్కలను సంరక్షించాలి!

**మట్టెవాడ, జూన్ 17 (పీపుల్స్ డైరీ):** తన 39వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకుడు ఆడెపు వెంకటేష్ శ్మశాన వాటికలో బుధవారం 39 మొక్కలను నాటారు. వెంకటేష్ 39వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 39 మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆడెపు వెంకటేష్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో జరుపుకోవాలని అన్నారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, జీడబ్ల్యూఎంసి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి పద్మశాలి సంఘం చేయూత



**కమలాపూర్, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి పద్మశాలి సంఘం ఆర్థిక సహాయం అందించింది. ఇటీవల వడదెబ్బతో అకాల మరణం చెందిన ఐల రాజేశం కుటుంబాన్ని ఆదుకునేందుకు పద్మశాలి సంఘం నాయకులు ముందుకొచ్చారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాజేశం కుటుంబానికి సంఘం సభ్యులు సేకరించిన రూ. 14 వేల నగదు సహాయాన్ని బుధవారం మృతుడి భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలోని నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం కమలాపూర్ మండల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొప్ప శివశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్, రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులికంటి రాజేందర్, భద్రకాళి దేవాలయ ధర్మకర్త బింగి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు వెంగళ బాలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోను సన్మానించిన సర్పంచులు



**నర్సింహులపేట, జూన్ 17 (పీపుల్స్ డైరీ):** నర్సింహులపేట మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్‌రావును బిఆర్ఎస్ కుచెందిన పలువురు సర్పంచులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో రాంప్రసాద్‌రావుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని రాంప్రసాద్‌రావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాలోత్ బాలు నాయక్, నరేష్ నాయక్, దారెల్లి రాధిక--రమేష్, కైలా రవి నాయక్, భూక్య వినోద్ వీరునాయక్ , ఉప సర్పంచ్ సురేష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ రెడ్డి వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి



**నల్లబెల్లి, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మందటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు, కీర్తిశేషులు మందటి లక్ష్మణ్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డి లక్ష్మణ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, మండల మరియు గ్రామ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.





## భద్రకాళి దేవాలయంలో పవన్ కళ్యాణ్ పూజలు

**మట్టెవాడ, జూన్ 17 (పీపుల్స్ డైరీ):** హన్మకొండ హనుమాన్ నగర్ లో అనారోగ్యంతో బాధ పడుతున్న తన అభిమాని నిరంజన్‌ని పరామర్శించేందుకు వరంగల్ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంతి కొనిదెల పవన్ కళ్యాణ్ వరంగల్ బుధవారం శ్రీ భద్రకాళి దేవాలయానికి విచ్చేశారు. ఆలయానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అమ్మవారికి చీర, ఓడిబియ్యం, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. పవన్ కళ్యాణ్ ని చూడటానికి వేలసంఖ్యలో భక్తులు, అభిమానులు గుడికి పోటెత్తారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. నూతనంగా ప్రతిష్ఠ చేసిన ధ్వజ స్తంభాన్ని కూడా పవన్ కళ్యాణ్ దర్శించి నమస్కరించారు. పవన్ కళ్యాణ్ వెంట బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## 26న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మహాసభ

### గణపురంలో కరపత్రాల ఆవిష్కరణ



**గణపురం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ డిఎస్పీ నాయకులు బుధవారం గణపురం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. "ఎవరి కులం ఎంతో.. వారికి అంత వాటా..!" అనే నినాదంతో నిర్వహించనున్న ఈ బహిరంగ సభ భూపాలపల్లిలోని కూరగాయల సంత, డిగ్రీ కళాశాల వెనుక సుభాష్ కాలనీలో జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కండె రవి మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు శతాబ్దాలుగా సామాజిక, రాజకీయ, ఆర్థిక వివక్షకు గురవుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో సామాజిక న్యాయం సాధన కోసం ప్రజల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాధికారంలో జనాభా ప్రాతిపదికన భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక న్యాయం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షీరాం ఆశయాల సాధన దిశగా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వరాజ్య ప్రేమికులు, అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్య వాదులు, యువకులు, రైతులు, కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, ఇంజపల్లి విక్రమ్, కొమ్ముల లింగన్న, ఇంజపెల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా రాంప్రసాద్‌రావు బాధ్యతల స్వీకరణ



**నర్సింహులపేట, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** నర్సింహులపేట మండల నూతన ఎంపీడీవోగా జి.రాంప్రసాద్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గంగారం మండలంలో మండల పంచాయతీ అధికారిగా (ఎంపీవో) సేవలందించిన ఆయన ఇటీవల పదోన్నతి పొంది ఎంపీడీవోగా నియమితుల య్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం ఇస్తూ మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని రాంప్రసాద్‌రావు తెలిపారు.

# నల్లబెల్లిలో 'సర్' శిక్షణ

### సమర్థవంతమైన సర్వేపై దిశానిర్దేశం



**నల్లబెల్లి, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లిలోని రైతు వేదికలో బుధవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై బిఎల్ఓ (BLO)లు, బి.ఎల్.ఏ (BLA)లు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా SIR ఇంటింటి సర్వేలో ఎన్యుమరేషన్ ఫామ్‌ను ఏ విధంగా పూరించాలి, బి.ఎల్.ఓ యాప్‌లో మ్యాపింగ్ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలనే అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో సర్వేను పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సర్వే సమయంలో ప్రజల నుంచి వచ్చే సందేహాలను ఎలా నివృత్తి చేయాలనే దానిపై కూడా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సమర్థవంతమైన సర్వే ద్వారా ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ అనంతరం, సర్వేలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించి, వాటిని అధిగమించే మార్గాలను వివరించారు. నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. నిరంతరం అందుబాటులో ఉంటూ, నిబంధనలకు లోబడి పని చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పని పూర్తి చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసిల్దార్‌తో పాటు, ఏ.ఎల్.ఎమ్.టిలు సతీష్, సుధాకర్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు బి.ఎల్.ఓ సూపర్వైజర్లు, అన్ని గ్రామాల జి.పి.ఓలు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## ఆత్మీయ భరోసా సాయం అందించాలి : రాజయ్య



**చిట్యాల, జూన్ 17(పీపుల్స్ డైరీ) :** ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి భూమిలేని వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిధులను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ భూమిలేని వ్యవసాయ పేద కూలీలకు సంవత్సరానికి 12 వేల చొప్పున రెండు విడతల్లో ఆరువేల లెక్కన ఆర్థిక సాయం అందిస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే అమలుపరిచి భూమిలేని వ్యవసాయ కూలీలను ఆదుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వం అధికారులు జాబ్ కార్డు ఉండి వ్యవసాయ భూములు లేని పేదల కూలీల వివరాలు తీసుకున్నారని కానీ నేటి వరకు వారి అకౌంట్లలో నగదు జమ చేయకపోవడం సరైనది కాదు అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధుల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులకు రెండున్నర సంవత్సరాలకు ఒక్కో జాబ్ కార్డు గల కుటుంబానికి 30 వేల రూపాయలను వారి అకౌంట్లలో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం జనసేన

### జిల్లా నాయకులు దేవేందర్



**చిట్యాల, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన హనుమకొండకు చెందిన యువ అభిమాని నిరంజన్‌ను స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మానవత్వం ప్రతి ఒక్కరినీ కదిలించిందని జనసేన పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయకులు దేవేందర్ కంకనాల అన్నారు. ఈ సందర్భంగా బుధవారం దేవేందర్ మాట్లాడుతూ నిరంజన్ తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ కలవాలని కోరుకోవడంతో ఆ విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఆయన స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించడం గొప్ప మానవీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిలా నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం వైద్య ఖర్చుల కోసం రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ఆయన గొప్ప మనసును చాటిందన్నారు. అంతేకాకుండా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేసి నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని చెప్పడం ఆయన భక్తి మానవత్వం కలగలిసిన వ్యక్తిత్వానికి నిదర్శనమని దేవేందర్ కంకనాల తెలిపారు. నిరంజన్ కుటుంబ జీవనోపాధి కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వానికి సూచించడం ద్వారా కేవలం ఆర్థిక సహాయం వద్దనే ఆగకుండా ఆ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు.

## పతులు పెత్తనం చెలాయిస్తే చర్యలు తీసుకోవాలి: కెవిపిఎస్



**నర్సింహులపేట, జూన్ 17 (పీపుల్స్ డైరీ):** స్థానిక సంస్థల్లో మహిళలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్ల లక్ష్యాలను కొందరు భర్తలు నీరుగార్చుతున్నారని, మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి పతులు అధికారాలు చలాయించడం ఆందోళనకరమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మండల అధ్యక్షుడు కురంది సురేష్, కార్యదర్శి మందుల యాకూబ్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహిళల సాధికారత కోసం హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు సమాన హక్కులు కల్పించాలని కృషి చేశారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక ఉద్దేశం వారు స్వతంత్రంగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి పాలనలో భాగస్వాములు కావడమేనన్నారు. అయితే మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే నిర్ణయాలు తీసుకుంటూ అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయని తెలిపారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, మహిళా సాధికారత లక్ష్యాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

# పలువురికి ఆదర్శంగా నిలిచిన బుద్దారం సర్పంచ్

## కూతురిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన సర్పంచ్ శ్రీలత అశోక్

**గణపురం, జున్ 17 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై తనకున్న విశ్వాసాన్ని బుద్దారం గ్రామ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ ఆచరణలో చూపించారు. బుధవారం మండలంలోని బుద్దారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో తన కుమార్తెకు ఐదో తరగతిలో ప్రవేశం కల్పించి ఇతర తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనే సందేశాన్ని సమాజానికి చాటాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో మెరుగైన బోధన, ఆధునిక సదుపాయాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ముందుండి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని చాటడం అభినందనీయమని అన్నారు. ఈ నిర్ణయం గ్రామంలో మరింత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రోత్సాహకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు సైతం సర్పంచ్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ప్రభుత్వ విద్యపై విశ్వాసానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మారబోయిన ఐలయ్య ,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ,వార్డ్ మెంబర్స్ ,గ్రామ ప్రముఖులు, యువజన సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల వైపు అడుగులు వేయాలి**

**ఉపాధ్యాయులు, గ్రామస్థుల హర్షం - నాణ్యమైన విద్యకు ప్రభుత్వ బడులే వేదిక**





## స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లయ్య

**చిట్యాల, జూన్ 17(పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున 50వ ఆవిర్భావ స్వర్ణోత్సవ వేడుకలను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య యువతకు పిలుపునిచ్చారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల మాజీ ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున రాష్ట్ర జిల్లా మండల గ్రామాలలో ఆవిర్భావ దినోత్సవం సెప్టెంబర్ 21 వరకు గ్రామ కమిటీలు పూర్తిచేసి సర్వోత్సవాలు జరుపుటకు కృషి చేసి 50వ ఆవిర్భవ స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కమిటీ సన్నాహక సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ డాక్టర్ జే బీ రాజు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అవిలయ్య సమావేశంలో తీర్మానించారని తెలిపారు. సామాజిక న్యాయం, హక్కుల కోసం పోరాడుతూ సంస్థ స్థాపించి ఐదు దశబ్దాలు గడిచిందని తెలిపారు. సామాజిక సంస్కరణల ఉద్యమాన్ని నూతన ఉత్సాహంతో గ్రామాలలోకి తీసుకెళ్లాలని నేటి యువతను కోరారు.

# ప్రభుత్వ బడుల్లో చేరితే ఉజ్వల భవిష్యత్

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కుల పంపిణీ చేసిన సర్పంచ్

**గణపురం, జున్ 17 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ప్రభుత్వ బడులపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని స్థానిక సర్పంచ్ రాధిక శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు దేసు సతీష్ కుమార్, దూలం కుమారస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తోందన్నారు. డిజిటల్ తరగతి గదులు, మెరుగైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి వసతులు ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పౌష్టికాహార భోజనం అందించడం అభినందనీయమన్నారు. ప్రైవేట్ పాఠశాలల మోజులో పడకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న అవకాశాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కృష్ణ, ఉపాధ్యాయులు భరత్ కుమార్, శకీరా బేగం, కుమారస్వామి, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, దేవేందర్, ముస్తాక్, దిల్షాద్, పీడీ సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్పణపల్లిలో మన ఊరు మన బడి




**కేసముద్రం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** మండలం అర్పణపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మన ఊరు మన బడి జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చీర వెంకటమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ చీర వెంకటమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల నమోదు పెంపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత విద్య వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడు తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విలువల తో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల చైర్ పర్సన్ హసీనా ఉపాధ్యాయులు రాజు సురేష్ స్వామి విజయ్ కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతోనే విద్యాబోధన

## సర్పంచ్ పాలెం యాదగిరి



**గోవిందరావుపేట, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, అర్హులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన నిర్వహించనున్న ట్లు బుస్సాపూర్ సర్పంచ్ పాలెం యాదగిరి అన్నారు, ఎలాంటి ఫీజులు లేకుండా ఉచిత దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బో దనలు బోధించే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి విద్యార్థుల కు ఆటపాటలతో విద్యా బోధనలు బోధించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బంగారు భవిష్యత్తు ఇవ్వాలనిపిల్లలను యాదగిరి కోరారు, అంతేకాకుండా బుసాపూర్ గ్రామానికి ఇటీవల ప్రీ ప్రైమరీ స్కూలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు, బుస్సాపూర్ పాఠశాలలో నిశ్చితార్థులైన ఉపాధ్యాయులు దీకొండ ఉష, దేతి దేవ్ సన్ రెడ్డి, విద్య కమిటీ చైర్మన్ బండపల్లి రాజశేఖర్, వార్డు సభ్యులు భేటీ దేవేందర్ రెడ్డి, గ్రామస్తుల సమీక్షంలో సర్పంచ్ పాలెం యాదగిరి చేతుల మీదుగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను చేర్పించారు. గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, బడి మానేసిన పిల్లలను బడిలో చేరితే విధిగా బడిలో చేర్పించాలని గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు,





### ప్రమాదకర కంచెతో వారం రోజుల్లో

# రెండు పశువులు బలి

**కేసముద్రం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** మండలం, ఉప్పరపల్లి శివారు అర్పణపల్లి ప్రభుత్వ వట్టి వాగు సమీపంలోని సర్వే నెంబర్లు : 161/3/2, 161/4/2, 162/2, 163 మొదలగు సర్వే నెంబర్లతో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో వేసిన పామ్ ఆయిల్ తోట కంచె వల్ల వారం రోజుల వ్యవధిలో రెండు పశువులు మృతి చెందాయి.గత వారం అర్పణ పల్లి గ్రామానికి చెందిన రైతు చింతనూరి వెంకన్న పెంచుకుంటున్న ఆవు కంచెలో ఇరుక్కొని చనిపోయింది. ఈ ఘటనపై కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నమోదైంది.తాజాగా బుధవారం రోజున 17-06-2026న ఉప్పరపల్లి గ్రామ రైతు కుండే ఏకస్వామి పెంచుకుంటున్న బర్రెల్లో ఒకటి అదే తోట కంచెకు తగిలిన విద్యుత్ వైర్‌ను తాకి షాక్‌తో మృతి చెందినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికులు, బాధిత రైతుల కథనం ప్రకారం.. తోట యజమానులు సోమ నితీష్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి, కళ్లెం సుజిత్ కుమార్ రెడ్డి తండ్రి వీరారెడ్డి పైన తెలిపిన సర్వే నెంబర్ల గల విస్తీర్ణంలో తోట చుట్టూ సరైన విధంగా కంచ వెయ్యకుండా ఒక దగ్గర కంచె తెగిపోవడం మరొక దగ్గర జంతువులు కాళ్లలో పడి ఇరుక్కొని చనిపోయే విధంగా పశువుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కరెంటు వైర్లతో కంచె వేయడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.ఈ మేరకు బాధిత రైతులు రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖలకు ఫిర్యాదులు చేశారు. అయినా యాజమాన్య నిర్లక్ష్యం కొనసాగుతుండడంతో పశువుల మరణాలు ఆగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏ జంతువులకు ప్రాణ నష్టం జరగకుండా పశువులకు రక్షణ కల్పించి, తోట యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువులకు, జంతువులకు ఎలాంటి ప్రాణనాష్టం జరగకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

# విచ్చలవిడి ఫీజుల దోపిడీపై నియంత్రణ చట్టం తేవాలి

## ప్రజా సమస్యలపై ఆగస్టు వరకు క్షేత్రస్థాయి పోరాటాలు : జిల్లా కార్యదర్శి బోడెంకి చందు



**చెన్నూర్, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు కార్పొరేట్ శక్తులకు అడ్డాగా మారాయని, ప్రైవేట్ సంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు డిమాండ్ చేశారు. చెన్నూరు మండల సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం ఉమారాణి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడెంకి చందు మాట్లాడుతూ, విద్య, వైద్యం, నిరుద్యోగం, ఇండ్ల స్థలాలు, రేషన్ పంపిణీ లాంటి ప్రజా సమస్యలపై ఈ నెల నుంచి ఆగస్టు వరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు, ఆందోళన పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్స్, లైబ్రరీలు, క్రీడా సామాగ్రి లాంటి కనీస వసతులు లేవని, ప్రాథమిక పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు ఏళ్ల తరబడి వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బడ్జెట్ కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని, 'కేజీ టు పీజీ' ఉచిత విద్య హామీ అటకెక్కిందని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వాలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఎందుకు తీసుకురావడం లేదని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, ప్రొఫెసర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతతో పాటు నిధుల లేమి తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వ వైద్యం కుంటుపడటంతో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కార్పొరేట్ ఆసుపత్రులు, స్కూళ్లు పేదలను నిలువునా దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు విద్యా, వైద్య ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, రేషన్ షాపుల ద్వారా 14 రకాల ని?యావసర సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, పెద్ద ఎత్తున ప్రచార ఆందోళనలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్మా పున్నం, పార్టీ నాయకులు సిడం సమ్మక్క, గావిడి భూదేవి, తుమ్మ రేణుక, మనుమండ్ల అనసూయ, బండారి రాజేశ్వరి, బొందన్న, యామిని, మదనక్క, స్వరూప, బాణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాక్‌లాక్ ఉద్యోగాల భర్తీకి స్పెషల్ నోటిఫికేషన్ ఇవ్వాలి

## సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్



**చిట్యాల, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** గత కొన్ని ఏండ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ ఉద్యోగాలకు ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులను ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో భర్తీకి నోచుకోకుండా మిగిలిపోయిన ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ ఉద్యోగాలను ప్రభుత్వం గుర్తించి ఆ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ విడు దల చేసి దాంతో భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో ఉన్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నా రు. రాష్ట్రంలోని ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ నిరు ద్యోగుల కోసం స్పెషల్ ఉద్యోగ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు

# రాజకీయ పార్టీల సహకారం కీలకం

### అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం - ఈఆర్‌వో చాహాత్ బాజ్‌పాయి




**మట్టెవాడ, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో), జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చాహాత్ బాజ్‌పాయి అధ్యక్షతన బుధవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ూ×=) కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ ఓ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీలచే నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సమక్షంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు డిక్లరేషన్ ఫారాలను అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన ఎన్యమరేషన్ ఫారాల పంపిణీ కూడా ఈ ప్రక్రియలో భాగంగా జరుగుతుందని వివరించారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆమె, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఎస్ఐఆర్‌పై ఉన్న అపోహలను రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు తొలగించాలని కోరిన ఆమె, తమ బూత్ లెవల్ ఏజెంట్ల ద్వారా ఓటర్లలో అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఏ రాజకీయ పార్టీ, మతం లేదా వర్గానికి సంబంధించినది కాదని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ప్రక్రియ పూర్తయిన అనంతరం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్) ప్రచురిస్తామని తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా లేదా ఏవైనా వివరాల్లో పొరపాట్లు ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దాఖలు చేసేందుకు మరో రెండు నెలలపాటు అవకాశం కల్పిస్తామని చెప్పారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని పేర్కొంటూ, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఈఆర్‌వో కార్యాలయం, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు వీటి ద్వారా నమోదు, సవరణలు, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌కు సంబంధించిన సమాచారం పొందవచ్చని చెప్పారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజలు భాగస్వాములు కావాలని ఈఆర్‌వో చాహాత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. సమావేశంలో తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ సుభాన్, కాంగ్రెస్ పార్టీ తరఫున దాసరి రాజేష్, బీజేపీ తరఫున రఘునా రెడ్డి, సీపీఎం తరఫున సింగారపు బాబు, బీఆర్ఎస్ పార్టీ తరఫున సీతారాం, బీఎస్పీ తరఫున సయ్యద్ సుల్తాన్ సాదిఖ్, వైఎస్సార్‌సీపీ తరఫున రాజనీకాంత్, ఎంఐఎం తరఫున సుభాన్, ఫైజుల్దీన్, టీడీపీ తరఫున శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## విత్తన చట్టం పరిధిలోకి మొక్కజొన్న కంపెనీలను తీసుకురావాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**ఏన్కూరు, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** విత్తన చట్టం పరిధిలోకి మొక్కజొన్న విత్తన కంపెనీలను తీసుకురావాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం ఏన్కూరు ప్రజా సంఘాల కార్యాలయం లో రైతు సంఘం మండల అధ్యక్షుడు నందూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన రైతు సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల తోపాటు మరికొన్ని చిన్న చిన్న ప్రాంతీయ కంపెనీలు ఖమ్మం జిల్లా లో రబీ సీజన్లో విత్తన మొక్కజొన్న సాగు చేయించి నేటికీ రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి అని అన్నారు. ముందస్తుగా పెట్టుబడి సొమ్ము ఆశ చూపి రైతులను విత్తన మొక్కజొన్న సాగు చేయుటకు ముందుకు వచ్చేలా చేస్తున్నాయి అని అన్నారు. ఈ రబీ సీజన్లో రైతులకు ముందస్తు పెట్టుబడి ఇవ్వలేదు, కూలీల కూడా రైతులు డబ్బులు చెల్లించి పంట కంపెనీల కు అప్పగించారు అని అన్నారు. విత్తన కంపెనీలను చట్ట పరిధిలోకి తీసుకు వచ్చి రైతులకు నష్టం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా యాప్ మూలంగా చదువు రాని రైతులకు, పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులు ఇక్కట్లు గురి అయ్యే అవకాశం ఉంది అని సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా లక్ష్మా, డివిజన్ ఉపాధ్యక్షులు దొంతబోయిన నాగేశ్వరరావు మండల కార్యదర్శి గుండా సత్యనారాయణ రెడ్డి, రాములు, లెనిన్, మల్లయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆ పాఠశాలలో అన్ని సమస్యలే



**కరకగూడెం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ పాఠశాల కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సర్పంచ్ పోటెయ్య తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాలకు చుట్టూ ప్రహరీ గోడ లేదు. దీంతో పశువులు, అనుమానిత వ్యక్తులు నేరుగా స్కూల్ ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సాయంత్రం వేళల్లో పాములు, ఇతర జంతువులు కూడా సంచరిస్తుండటంతో పిల్లలను బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇక తాగునీటి సమస్య మరింత దారుణంగా ఉంది. స్కూల్‌లో చేతిపంపు లేకపోవడంతో విద్యార్థులు దాహం తీర్చుకోవడానికి, మధ్యాహ్న భోజనం చేసేందుకు అర కిలోమీటర్ దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఎండాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. గిరిజన ప్రాంత విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఐటీడీఏ, విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్కూల్‌కు ప్రహరీ గోడ నిర్మించి, చేతిపంపు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి..

# బ్రతుకులనే బలి తీసుకుంటోంది

### మూడు రోజుల్లో ముగ్గురు గౌడన్నల బ్రతుకుల్లో విషాదం బాధాకరం - సమ్మిగౌడ్ చిలువేరు

**కేసముద్రం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** మండలంలో వరుసగా జరుగుతున్న గీత కార్మికుల ప్రమాదాలు గౌడ కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి నేడు బ్రతుకులనే బలి తీసుకుంటోందని అన్నారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గౌడన్నలు అదే తాటి చెట్ల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత బాధాకరమన్నారు.తమ భర్తలు పొద్దున వృత్తి రీత్యా బయటకు వెళ్లిన వాళ్ళు తిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చే వరకు తాళి చేతిలో పట్టుకొని చూసే వాళ్ళ ఎదురుచూపులు మాటల్లో వర్ణించలేనివని ఆవేదన వ్యక్తం చేసారు..గత కొద్ది రోజుల వ్యవధిలోనే కేసముద్రం మండలంలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు. కేసముద్రం గ్రామానికి చెందిన ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టిందని, చేతులు, కాళ్లు విరిగిపోయి ప్రస్తుతం హన్మకొండలోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అలాగే ఇంటికన్నె గ్రామానికి చెందిన సార రాజు తాటిచెట్టుపై



నుంచి కిందపడటంతో వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారని అన్నారు. ఇక తాజాగా కల్వల గ్రామానికి చెందిన వేముల మల్లేశం తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందడం గౌడ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన ఆయన, పంచనామా ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి శవంగా ఇంటికి చేరడం హృదయ విదారకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్, మోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉదయం కుటుంబం కోసం పనికి వెళ్లిన గౌడన్న సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేరుతాడో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి ఇచ్చిన తాటి చెట్టును నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న గౌడన్నలు నేడు అదే తాటి చెట్లపై ప్రాణాలు కోల్పోతున్నారు. పూట గడవాలంటే చెట్టు ఎక్కాలి... ప్రాణం దక్కాలంటే అదృష్టం ఉండాలి అనే పరిస్థితి గౌడ కుటుంబాలను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు..మృతి చెందిన వేముల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.. అలాగే ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ మరియు సార రాజులకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా తోపాటు వైద్య ఖర్చులను పూర్తిగా లిప్రభుత్వం భరించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు : ఎస్సై సంధ్య



**ఏన్కూరు, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూర్ మండలం నందు విత్తన దుకాణం షాపులను టాస్క్ ఫోర్స్ టీమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ఉన్న విత్తన దుకాణ దారులు నకిలీ విత్తనాలు అమ్మకూడద దని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏన్కూర్ సబ్ ఇన్స్పెక్టర్ సంధ్య, మండల వ్యవసాయ అధికారి నరసింహారావు తెలిపారు. రైతుల వద్ద గాని, గ్రామలలో గాని ఇంటిలో విత్తనాలు పెట్టి అమ్మితే వారిపై పి డి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు. టాస్క్ ఫోర్స్ టీమ్ తనిఖీలలో భాగంగా గత సంవత్సరాలలో పట్టుపడిన నకిలి విత్తనాల ఇళ్లను మరియు పెరడ్లను ఇతర ప్రాంతాలను తనిఖీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం నందు హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, వ్యవసాయ విస్తరణ అధికారి సపావట్ సైదులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణన్ని ప్రారంభించిన ఎస్ఐ

**నెల్లికుదురు, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటు ధరలకు అందించాలని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. నూతన ఎరువుల దుకాణం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెల్లికుదురు ఎస్ఐ రమేష్ బాబు రిబ్బన్ కత్తిరించి దుకాణాన్ని ప్రారంభించారు. దుకాణ యజమాని విష్ణు మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రామన్నగూడెం గ్రామ సర్పంచ్ బండి శ్రీను కాసికల్ గ్రామ సర్పంచ్ లీలా దేవేందర్ రెడ్డి, అర్పణపల్లి ప్రజా ప్రతినిధి చీర వీరస్వామి, కల్పగురి రామచంద్రు, స్థానిక గ్రామ పెద్దలు, రైతులు, వ్యాపారస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుకాణానికి మామిడి తోరణాలు, బంతిపూల దండలు, బెలూన్లతో అలంకరించారు.

## డిప్యూటీ తాసిల్దార్‌గా సులోచన



**ఏన్కూరు, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు డిప్యూటీ తహసిల్దార్ గా ఎం సులోచన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఆర్ఎల్ఐపి .కాంతనపల్లి ప్రాజెక్టు పాల్వంచ నుండి ఇటీవల పెనుబల్లి కి బదిలీ అయ్యారు . అక్కడనుండి ఏన్కూరు కు డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

## కొండెక్కిన చికెన్ ధరలు..

### సామాన్యులకు భారమైన చికెన్

**కరకగూడెం, జూన్ 17 (పీపుల్స్ డైరీ) :** ఒకప్పుడు వారానికి ఒకసారి అయినా ఇంట్లో చికెన్ వండుకునే కుటుంబాలు, ఇప్పుడు ధరలు చూసి వెనక్కి తగ్గుతున్న పరిస్థితి నెలకొంది. కరకగూడెం మండలంలోని ఆనంతరం, కరకగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో చికెన్ ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజలకు భారంగా మారాయి. ప్రస్తుతం కేజీ చికెన్ ధర రూ.320కు చేరుకోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.200 నుంచి రూ.240 మధ్య లభించిన చికెన్ ధరలు క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.320కు చేరుకోవడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరిగాయి. ముఖ్యంగా మధ్యతరగతి, రోజువారీ కూలీ కుటుంబాలు చికెన్ కొనుగోలు విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. "పిల్లలు అడిగితే కొనక తప్పదు. కానీ కేజీ రూ.320 అంటే సామాన్యుడికి చాలా భారమే" అని స్థానిక వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు చికెన్ ధరలు పెరగడంతో కొనుగోలుదారుల సంఖ్య కొంత తగ్గినప్పటికీ వ్యాపారంలో పెద్దగా మార్పు లేదని వ్యాపారులు చెబుతున్నారు. వేసవి కాలం తర్వాత సరఫరా తగ్గడం, పెంపక వ్యయం పెరగడం, డిమాండ్ అధికంగా ఉండటం వంటి కారణాలతోనే ధరలు పెరిగినట్లు



వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే ధరల పెరుగుదలపై అధికారులు దృష్టి సారించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ధరలు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో చికెన్ సామాన్యుడి పళ్లెంలో కాకుండా, ప్రత్యేక సందర్భాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com